


వాకిట్లో బండి ఆగిన శబ్దంవిని బిలబిల మంటూ నలుగురు మనుష్యులు గబగబా బయటకు వచ్చి బండిలోంచి దిగుతున్న వ్యక్తులనుచూసి విప్పారిన ముఖాలతో "రండి రండి" అంటూ లోపలికి ఆహ్వానించారు.

ఆహ్వానాన్నందుకున్న ఆ నలుగురూ ప్రసన్నవదనాలతో వారి ననుసరించి లోపలకు వచ్చారు. ఆ రోజు రామయ్యా రెండోకూతురు సత్యవతిని చూడటానికి పెళ్ళివారు వచ్చారు. మధ్యగదిలో ముందే చాపలుపరచి సిద్ధంచేసి వుంచారు కనుక దానిమీద ఆసీనులయ్యారంతా. ఆ గది ఒక మోస్తరు గది. గోడమీద సినిమా తారల క్యాలెండర్లు రెండు, గాంధీగారి పటం, ఒక ప్రక్కగా మేజాబల్ల. దాని పైన పెళ్ళివారికోసం తెల్లగా వుతికివేసిన టేబిల్‌క్లాత్. వీటి పరిశీలనలోపడ్డాడు

పెళ్ళికొడుకు, పెద్దవాళ్ళు మాట్లాడు కుంటూ వుండటంతో పది నిముషాలా కబురూ ఈ కబురూ చెప్పి లోపలికివెళ్ళి నాలుగు పెద్ద ఇత్తడిగ్లాసులనిండా కాఫీ తీసుకువచ్చాడు రామయ్య. కాఫీలు త్రాగుతూనే''అమ్మాయిని పిలిపించండి" అన్నాడు కాబోయే వియ్యంకుడు కామయ్య. "చిత్తం"అంటూ పైకండువా సవరించుకుంటూ పరుగెత్తినట్లే లోపలికి వెళ్ళాడు రామయ్య. పదినిముషాల్లో సత్యవతిని తీసుకువచ్చింది రామయ్య పెద్దకూతురు కనకదుర్గ. సత్యవతి తలవంచుకుని చాపమీద కూర్చుంది.

"నీ పేరేమిటమ్మా" అనడిగింది కాబోయే అత్తగారు సూరమ్మ.

"సత్యవతి."

"వంటాఅదీ వచ్చా?"ఇదితోటికోడలు జయలక్ష్మి ప్రశ్న.

"ఆ! వంటమాత్రం బాగా చేస్తుంది. పిండివంటలింకా చేతకావు. ఇంకా చిన్న పిల్లేగదండీ" అంటూ దీర్ఘంతీసింది కనకమ్మ కూతురును సమర్థిస్తూ.

"ఏం చదువుకున్నావు తల్లీ?" ఇది కాబోయే మామగారి పలకరింపు.

''టెన్త్‌క్లాస్ ప్యాసయ్యాను."సత్యవతి సమాధానానికి ఉలిక్కిపడ్డాడు వరుడు చక్రపాణి.

అతను ప్యాసయింది 'థర్డుఫారం' మటుకే.

పరీక్షగా ఆమెనే తిలకించసాగాడు చక్రపాణి. చామనఛాయ, ఫర్వాలేదని పించే కనుముక్కు తీరు, జడ వదులుగా అల్లుకుని ఒకప్రక్కగా పెట్టిన ఎఱ్ఱ గులాబిపువ్వు, జడగింటలు, అంతా పాత క్రొత్తల కలయికలా వుందామె. ఆ పద హారు పదిహేడేళ్ళ పిల్లని పరిశీలించడం ముగిసాక దిక్కులుచూడటం ప్రారంభిం చాడు చక్రపాణి.

అమ్మాయిని పాట పాడించబోయా రంతా కలసి.

"నాకు పాటలు రావు" అని కచ్చి తంగా జవాబిచ్చింది సత్యవతి.

దాంతో ఆ ప్రోగ్రాం కాన్సిల్ అయి పోయి ఇంకేం అడిగేందుకూ కనబడక లోపలికి పంపించేసారు సత్యవతిని.

రెండేసి మినపసున్ని ఉండలు, కాస్త కారపూస, నాలుగు ప్లేట్లలో సర్ది వచ్చిన పెళ్ళిపెద్దలందరికీ అందించింది కనక దుర్గ. అవి తిని, రెండోసారి కాఫీ త్రాగి ఏ సంగతీ నాలుగురోజుల్లో కబురుచేస్తాం అంటూ లేచారు. వెడుతున్న వాళ్ళని కిటికిలోంచి చూసింది సత్యవతి.

తన బావగారు అడిగేప్రశ్నలకి ఏవో జవాబిస్తూ గుమ్మంబయటే కనిపించాడు చక్రపాణి. నల్లగా కండలుతిరిగిపొడవు, లావు సరిపడావున్న శరీరం, మామి డంచు నేతపంచ, మల్లుచొక్కా ధరించి వున్న అతన్ని చూసేసరికి''అబ్బ! మరీ

మోటుగావున్నాడు," అనుకుంది సత్యవతి అసంతృప్తిగా

పెళ్ళివారిని సాగనంపి లోపలికివచ్చిన రామయ్య, పెళ్ళికొడుకు ఇల్లు, అతని కున్న పొలం, వ్యవసాయంపట్ల అతని కున్న ఆసక్తి, తెలిసిన మెళకువలు, సమర్థత, భార్యకు, కూతురికి మైమరచి చెబుతూవుంటే ప్రక్క గదిలోంచి వింటున్న సత్యవతి "ఆ! ఎన్నివుంటే యేం? మనిషిలో నాజూకుతనం లేక పోయాక " అనుకుంది. పైగా థర్డుఫారం గ్రాడ్యుయేటు. తనకన్నా తక్కువే చదివాడు అనుకుంది కాస్త అసహనంగా.

అది పల్లెటూరు. ఆ పల్లెలోనే పుట్టి పెరిగిన రామయ్య ఆ వాతావరణాలకి, ఆ మన స్తత్వాలకీ అలవాటుపడి పోయాడు. పెద్ద కూతురుకి ఆ పల్లెటూరి సంబంధమే తెచ్చిచేశాడు. రెండో కూతురికి పల్లెటూరిసంబంధమే స్థిరపర చాలనుకున్నాడుగాని కూతురి పెళ్ళికి ఆమె ఇష్టాయిష్టాలు, వరుడు నచ్చిందీ లేందీ అడిగి తెల్సుకోవాలని అతనికి తోచలేదు. తోచదుకూడా. మగపెళ్ళివారికి నచ్చితే చాలు; వారి వాక్కు బ్రహ్మవాక్కుగా భావించి తాము తలవంచాలనిఅనుకునే తత్వంకలవాడు కనుక చక్రపాణి పెళ్ళికి ఇష్టపడ్డాడు అని తెలియగానే ఎగిరిగంతు లేసి ముహూర్తాలు పెట్టించాడు. పెళ్ళి పనులు జోరుగా సాగుతున్నాయి. "పసుపు కొట్టించడం, అప్పడాలు, వడి యాలు పెట్టించడం, కారాలు కొట్టించి, మినపసున్ని విసిరించి, అరిసెలు, జంతి కలు అన్నీ చేయించేసరికి లగ్నంరోజు దగ్గరకి వచ్చింది. రామయ్య కొడుకులు ముగ్గురూ ఆడపిల్లలకంటే చిన్నవారవడం వల్ల పెద్దల్లుడు గోవిందమే అన్నిటికీ కొడుకులా ఆదుకున్నాడు.

తాటాకులు కొట్టి తెచ్చి రామయ్య, గోవిందంతే స్వయంగా పందిరి వేశారు. పెళ్ళికూతుర్ని చేస్తుంటే సత్యవతి మనసులో తీరని వెలితి పట్టుకుంది. పల్లె టూరిలో పశువుల మధ్య, పొలాల్లోపడి మట్టికొట్టుకుంటూ తిరిగేభర్త కాదు ఆమెకి కావల్సింది. టెర్లిన్ పాంటు, బుష్ షర్టు ధరించి, క్రాఫ్ చెరిగిపోకుండా నీటుగా వుంటూ ఆఫీసులో పనిచేసుకొని వచ్చే అందమైన యువకుడు భర్తగా కలల్లో నిలుపుకుంది. అలాంటి వ్యక్తి కావాలని ఆశపడింది. ఆమె ఆశ తలక్రిందులు చేస్తూ పల్లెటూరిబైతే మొగుడవ బోతున్నాడు. కాని అది చెప్పడానికి ధైర్యంచాలక తలవంచింది చివరికి. పెళ్ళి బాగానే జరిగి మూడు నిద్రలకి అత్తగారింటికి వెళ్ళింది సత్యవతి.

విశాలమైన ఇంటి వీధివైపుఆవరణలో రకరకాల ముద్దబంతిపూలు, పచ్చని చామంతులు, బంగాళాబంతిపూలు తల లూపుతూ స్వాగతం పలికాయి నూతన వధువుకు. ఒక ప్రక్క కనకాంబరం, సన్నజాజులపూలు, మరో ప్రక్క

గులాబీలు. ఒక్క ఎండుటాకయినా లేక ఏ చెత్తా చెదారమూ లేక ఎంతో శ్రద్ధగా చూసుకుంటున్నారనడానికి నిదర్శనంగా పరిశుభ్రంగా వున్నాయి.

గుమ్మంలోకి కాలు పెట్టగానే అత్తగారు సూరమ్మ దిష్టితీసి, హారతి పట్టింది. "కుడికాలు ముందుపెట్టి మెల్లగా లోపలికి రామ్మా !" అంది ఆప్యాయంగా.

అలాగే కుడికాలు ముందుమోపి లోపలికి అడుగు పెడుతూనే పరిశీలనగా చూసింది. అది పెద్ద మండువాఇల్లు. విశాలమైన గదులు, శుభ్రమైన గాలీ వెలుతురూ వస్తూ కొత్తగా కొట్టిన సున్నపు ఘాటుతో ఎంతో చక్కగావుంది.

పెరటివైపు బావిదగ్గర అరటిచెట్లు, తోటకూర, గోంగూరాలాంటి ఆకు కూరలు, పైకి పాకించిన సొర తీగలు, పందిరికి అల్లుకుంటున్న చిక్కుడుపాదులు వంగ, బెండ మడులు, ఒక్కప్రక్కగా జామచెట్లు ఎంతో పొందిగ్గా వున్నాయి. విశాలమైన ఆ పెరడులోనే ఒకప్రక్క పశువులశాల వుంది. రెండు గేదెలు, ఒక ఆవు అన్నీ బాగానేవున్నా సత్యవతికి మాత్రం ఏమంత గొప్ప అనిపించలేదు. తమకీ ఇల్లు వుంది కాకపోతే దీనికంటే కాస్త చిన్నది. ఏవో పాదులు తమదొడ్లోనూ వున్నాయి. ఈ గేదెలూ ఆవులూ లేవు. ఎందుకొచ్చిన సంత ఇది. పేడ, గడ్డి, వానకురిసిందంటే చితచిత లాడుతూ పాడురోతగా వుంటుందేగాని శుచా శుభ్రమా ! అనుకుంది మనసులోనే. భర్త కేమాత్రం తీసిపోని విధంగా వున్నాడు బావగారు చలపతి. తోడికోడలు విజయలక్ష్మికి ఇద్దరు పిల్లలు కూడా !

తనభర్త అక్కగారు రామలక్ష్మి. ఆమె భర్తని చూస్తేనే భయం వేసింది. అంతకంటే ఘనుడన్నట్లు తన భర్త కంటే మరీ మోటుగా వున్నాడు భూపతి. అతనితో కాపురం ఎలా చేయగలుగుతోందా ! అని ఆశ్చర్యపడింది లోలోన సత్యవతి.

ఆ సాయంత్రం బంతులాటలో తనకి వచ్చిన వరసపాటలన్నీ పాడింది రామలక్ష్మి మరదలిపైన. వారి పరిహాసాలూ అవీ చూసి అంతా 'అడవి మేళం' అనుకుంది సత్యవతి.

ఆఖరి కొడుకు అవడంచేత, ఆపైనింక పిల్లలు లేరుగనక కామయ్య చిన్నకొడుకు పెళ్ళిలో సమారాధనలు, సత్యన్నారాయణ వ్రతాలు, భోజనాలు అన్నీ అట్టహాసంగానే జరిపించాడు. అక్కడ మూడు నిద్రలు అయ్యాక భర్తతో పుట్టింటికి వచ్చింది సత్యవతి.

ఆ రోజే శోభనం ముహూర్తంకూడా నిర్ణయించారు. సత్యవతి అంటే చక్రపాణికి చాలా ఇష్టం కలిగింది. ఎప్పుడెప్పుడు భార్య వస్తుందా అని ఎదురు చూస్తూ కూర్చున్నాడు గదిలో. ముత్తైదువులు లోపలికి పంపి తలుపు వేసు

కొని వెళ్ళిపోయాక ఆ గది అలంకరణ అంతా తను సినిమాల్లో చూసేవిధంగా వుందా లేదా అని పరీక్షించసాగింది సత్యవతి.

చక్రపాణి దగ్గరగావచ్చి భుజంమీద చెయ్యి వేశాడు. ఆ స్పర్శకి వులిక్కిపడి పక్కకి చూసింది. చక్రపాణి !

"ఏమిటంత దీక్షగా చూస్తున్నావు ? గది అలంకరణ బాగుందా లేదా అనా ?" అంటూ చనువుగా ఆమె చెయ్యిపట్టుకొని మంచంమీద కూర్చుని, ప్రక్కన కూర్చోపెట్టుకున్నాడు.

సత్యవతి మూగదానిలా చూడ సాగింది.

"ఆ పంచెకట్టు, ఆ తీరు. ఎన్నడూ తను వూహించుకోని భర్త లభించాడు గదా" ! అనుకుంది మనసులో.

భర్త మాట్లాడిన పది మాటలకి రెండింటికి మాత్రం జవాబిచ్చింది సత్యవతి. క్రొత్తగనక సిగ్గుపడుతోందిలే అనుకుని సరిపెట్టుకున్నాడు చక్రపాణి. ఆమెని దగ్గరకి తీసుకొని గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు. పెదవులు ముద్దుపెట్టుకున్నాడు. అతడు ఏంచేసినా ఆమెకి మోటుసరసంగానే కనిపించింది. ఆ రోజేకాదు ఆ మూడురోజులుకూడా.

ఆమె కోరికకు భిన్నంగా పదహా ర్రోజుల పండుగ అవగానే కాపురానికి తీసుకువెళ్ళిపోయాడు చక్రపాణి. రోజూ ఉదయం లేవగానే చక్రపాణే మొక్కల సంరక్షణ చూసుకుంటాడు. తోటి కోడలుజయలక్ష్మి మంచి పనిమంతురాలు. తెల్లవారుఝామునే అత్తగారితోపాటు జయలక్ష్మికూడా లేచి పాచిపనులు చేసు కోవడం, పొయ్యి రాజేసి నీళ్ళకాగు వేయడం, టిఫిను చేయాల్సివస్తే పప్పు రుబ్బటం మొదలైనవి తనే చక్కబెడు తూండేది.

కొత్త కోడలని సత్యవతిని ఏ పనీ చేయనిచ్చేదికాదు.

"అమ్మా, వదినా ఇద్దరూ చెరొక పనీ చేసుకుంటున్నారు. కాస్త నువ్వుకూడా వెళ్ళి సాయంచెయ్యి" అని కాపురానికి వచ్చిన రెండోనాడే భార్యకి చెప్పాడు చక్రపాణి.

"నేనలా చీకటితో లేవలేను బాబూ" అంది సత్యవతి నిర్మొహమాటంగా. తెల్లారి ఆమెలేచి సాయంచేయబోయేసరికి అక్కడ పనులేమీ కనబడేవి కావు. పొద్దున్నే ఆవకాయ, పెరుగు వేసుకుని బావగారు, భర్త చద్దన్నం తింటూవుంటే చిరాగ్గా వుండేది సత్యవతికి.

కంచం అన్నం తిని బారెడు గ్లాసు నిండా కాఫీకూడా త్రాగి వెడుతూంటే ఆ అన్నదమ్ముల్ని చూస్తే ఆశ్చర్యం అనిపించేది.

మామగారు వయస్సు మళ్ళిన వాడవడంతో పొద్దున్నే చద్దన్నం పడక ఏదన్నా టిఫిను తిని వెళ్ళేవాడు. చద్దన్నం జయలక్ష్మి కూడా తింటుంది.

ఒకటి రెండు రోజులు సత్యవతినికూడా తినమని బలవంతంచేశారు కాని సత్యవతి తినడానికి ఒప్పుకోకపోవడంతో మామగారికి చేసే ఫలహారమే ఆమెకీ కాస్త పెట్టి కాఫీ ఇచ్చేవాళ్ళు. తమ ఇంట్లో ఏదో ఒక కూరా, పచ్చడీ వేసుకొని తినే అలవాటు. ఇక్కడ మధ్యాహ్నం భోజనానికి పప్పు, కూరా, పచ్చడి, చారు అన్నీ చేస్తారు. రాత్రి మళ్ళీ పూర గాయ, అప్పడాలు, వడియాలు, చారు అన్నీ వుంటాయి. 'అబ్బ! మరీ మోటతిళ్ళు' అనుకుంది. ఆమె అసలు భరించలేని విషయం ఇంకొకటి వుంది ఆ యింట్లో.

మామగారు తిని లేచిన విస్తట్లో అత్తగారు, భర్త తిని లేచిన కంచంలో తోటి కోడలు, అన్నం పెట్టుకొని తినడం ఆమెకి రోతగా వుండేది. 'ఛీ! ఎంగిలి కూడు' అని విసుక్కునేది. భర్త కంచంలో కూచోమని సత్యవతికి చెప్పినా, అలాగేనంటూ శుభ్రంగా తోమి కడుక్కువచ్చి పెట్టుకుంటూవుంటే విడ్డూరంగా చూసేవాళ్ళు, అత్తగారూ తోటికోడలు.

"అలా భర్త తిని లేచినదాంట్లో పెట్టుకుని తినడం పుణ్యం అమ్మాయి" అని అత్తగారు హితబోధ చేయబోయింది.

"మీ పుణ్యాలకీ, మీకూ ఒక నమస్కారం. నేనలా ఏబ్రాసి తిళ్ళుతినలేను" అని జవాబిచ్చింది.

చేసేదేంలేక దవడలు నొక్కుకుని వూరుకున్నారు ఇద్దరూ. అయినా వుండబట్టలేక కొడుకుతో చెప్పింది సూరమ్మ.


"పోనీలే! ఏదో చిన్నపిల్ల. పైగా కాస్త చదువుకుంది. కొన్నాళ్ళు పోతే తనే తెలుసుకుంటుంది." అని సర్ది చెప్పాడు చక్రపాణి.

నిజమేనని వూరుకుంది సూరమ్మ. ఆమెకి 'అత్తగారిని కనుక నా మాట అక్షరాలా పాటించి తీరాలి', అన్న భావనలేదు. 'ఏదోలే కొంతకాలానికి వాళ్ళే తెలుసుకుంటారు' అనుకునే తత్వంకలది.

జయలక్ష్మికి సత్యవతిని చూస్తే విడ్డూరమనిపించే విషయం మరొకటి వుంది. సాయంత్రం అయ్యేసరికి జాజి పూలు, కనకాంబరాలూ అన్నీ కోసుకుని బారెడు దండ తను, మరో బారెడు కూతురికి పెట్టుకునే జయలక్ష్మికి సత్యవతి అసలు పూలే పెట్టుకోకపోవడం వింతగా ఉండేది.

దొడ్లో అన్ని పూలు వుంటే చక్కగా కట్టిపెట్టుకోరాదా! సన్నజాజులు, కనకాంబరాలు ఆ ప్రక్కమడిలో మరిది తెప్పించి వేసిన మరువం, దవనం అన్నీ ఉన్నాయి. వాటిని కట్టి పెట్టుకుంటే బాగుంటుందిగదా!"

అది సత్యవతి కిష్టంలేదు. ఇదే బస్తీలో కాపురం ఉద్యోగం చేసేభర్త అయితే సాయంత్రం అయ్యేసరికి వస్తూబజార్లో దండకొని తెచ్చి స్వయంగా తన జడలో అలంకరించేవాడు. ఇక్కడ తనుకోసుకుని



కట్టుకుంటే రాత్రి తొమ్మిదింటికి కొంప జేరి, భోజనంచేసి గదిలోకి భర్త వచ్చేసరికి తనాక నిద్రతీసి లేస్తుంది కనక అవి కాస్తా నలిగేపోతాయి. అలా పైకి అనటం ఇష్టంలేక "జాజి పూలు కడుతూంటేనే నలిగిపోతాయి. అందుకే పెట్టుకోను" అని జవాబిచ్చింది.

"పోనీ కనకాంబరాలు, మరువం కలిపి పెట్టుకో"అంది వూరుకోలేక జయ లక్ష్మి.

సత్యవతి మౌనం వహించింది.

"బంతిపూలు, చామంతి పూలయితే అసలునలగవనుకో."సూరమ్మ అమాయకంగా చెప్పింది.

"అవిఅన్ని కాలాల్లోనూపూయవుగా." నవ్వుతూ అంది సత్యవతి.

"నిజమే."

అంతటితో ఆ సంభాషణ ముగిసి పోయింది.

తనకంటే ఎక్కువ చదువుకుందని చక్రపాణి సత్యవతిని ఎంతో గౌరవంగా చూసేవాడు. ఒకరోజు తోటికోడలు

గదిమీదుగా వెడుతూ లోపలికి చూసింది సత్యవతి. బావగారు చలపతి మంచం మీద కాళ్ళు బారచాచి పడుకుంటే జయ లక్ష్మికాళ్ళుపడుతోంది.అతడు తాంబూలం నములుతూ సగం తన నోట్లోంచి తీసి జయలక్ష్మి నోట్లో కుక్కాడు. అదే మహద్భాగ్యం అన్నట్లు జయలక్ష్మి ముసిముసి నవ్వులు నవ్వుతోంది. ఆ దృశ్యం చూసేసరికి ఒళ్ళు జలదరించింది సత్యవతికి. మోటసరసం, మొరటు మనుష్యులు. ఇంటి చాకిరీతోనే చస్తుంటే రాత్రికి భర్తగారికి మర్దనచేస్తూ సేవలు కూడాను" అనుకుంది చిరాగ్గా.

అదికాస్తా భర్తదగ్గర అనేదాకా సత్య వతికి నోరు వూరుకోలేదు.

తన భార్యచేత కాస్త కాళ్ళుపట్టమందా మనుకొని సంబరపడిన చక్రపాణి వెంటనే నోరునొక్కుకున్నాడు సత్యవతి అభిప్రాయాలు గమనించి.

## 2

బెజవాడలో సత్యవతి పినతల్లి అనసూయ వుంది. క్రొత్తగా పెళ్లయిన అక్క కూతురు సత్యవతిని, ఆమె భర్తని రమ్మని ఆహ్వానించింది. చక్రపాణి కది నూర్పిళ్ళ సమయం కనుక బాగుండదని సత్యవతి నొక్కత్తినీ పంపాడు.

అక్కడకి చేరగానే ఎంతో హాయని పించింది సత్యవతికి. సందడి, సరదా లకి లోటులేని బెజవాడలో నిత్యం ఏదో ఒక సినిమాకి బయలుదేరుతూనే వుండేది సత్యవతి. పోనీలే మళ్ళీ ఆ పల్లె చేరితే చూడటం పడుతుందా ఏమన్నానా! అని అనసూయ, ఆమె భర్త జనార్దనం అభ్యంతర పెట్టేవారుకాదు.

అక్కడ అత్తగారింట్లో తెల్లవార్తూండే సరికల్లా లేచితీరాలి. క్రొత్తల్లో కొత్తపెళ్ళికూతురని అను కున్నా రాను రాను జయలక్ష్మి తను లేచిన అరగంట, గంటలోపే వచ్చి సత్యవతి గది తలుపుకొట్టి "సత్యా లే" అని మేలుకొలుపులు పాడేది అదొక పెద్ద న్యూసెన్సుగా అనిపించేది సత్య వతికి. "తను లేచిందిగా చాలదూ; ఇప్పటినించే లేచి ఏంచేయాలి ?" అని విసుక్కునేది. చక్రపాణి అది గమనిం చినా తెలియనట్లు ఊరుకోవడంతో భర్త నించి ఏ విధంగానూ తనకి సపోర్టు రాలేదు కనుక తిట్టుకుంటూనే లేచేది. క్రమంగా అదే అలవాటు అవుతుందని చక్రపాణి మౌనం వహించేవాడు.

ఇక్కడ బస్తీలో ఆ బాధలేదు. అనసూయది ఒంటరి కాపురం. ఎన్నిం టికి లేచినా అడిగేవారు లేరు. అది చాలా నచ్చింది. ఒంటరి కాపురం, అదీ బస్తీలో. ఎంతైనా సుఖపడవచ్చు, అనుకుంది. అక్కడికి తాను కష్టపడి పోతూన్నట్టే.

ఇక్కడి పద్ధతులు, అలవాట్లూ అన్నీ వేరు. ఉదయం చద్దన్నం ఆవకాయ లతో తినే పెద్దవాళ్ళెవరూ కనిపించలేదు.

ఇంత చిన్నపిల్లలు కూడా చద్దన్నం తినకుండా నాజూగ్గా టిఫిన్లు చేసి బడికి వెళ్ళటం చూసి ముందు ఆశ్చర్య మనిపించింది కూడా.

అనసూయగారింటి ప్రక్క ఒక జంట బహుశా కొత్త కాపురం అయి వుంటుంది. ఇద్దరే వుండేవాళ్లు. పెద్ద వాళ్ళెవరూ తోకల్లా లేరు అని సంబర పడింది సత్యవతి.

అస్తమానం వాళ్ళ ఇంటికేసి, ఆ వ్యక్తులకేసి చూస్తూ వుండటమే పెద్ద పని అయింది పనిలేని సత్యవతికి.

అతనికి స్కూటరు వుంది ఉదయం ఆఫీసుకు అతను స్కూటరుమీదే వెళ్ళి వస్తూ వుండేవాడు. అతను వెడుతూ వుంటే గుమ్మందాకా భార్య నవ్వుతూ వచ్చి చేయి వూపేది. అతను కూడా చేయి వూపి వెళ్ళిపోయేవాడు. రోజూ సాయంత్రం వస్తూ పూలదండ తెచ్చేవాడు. అప్పటికి ఆమె చక్కగా ముస్తాబయి వుండేది. కాసేపటికల్లా అతను తెచ్చిన పూలు ముడుచుకుని ఇంచక్కా స్కూటర్ మీద ఇద్దరూ బయటికి వెళ్ళిపోయేవారు. ఇవన్నీ కళ్ళింత చేసుకుని చూస్తుండేది సత్యవతి. "సంసారం అంటే అది. భర్త అలా వుండాలి." అని వాళ్ళు వెళ్ళగానే అనుకుంటూ నిట్టూర్చుతూ వుండేది మనసులో.

'తన భర్తా వున్నాడు. చదువూ సంధ్యా, నాజూకుతనం ఏమాత్రంలేని మొరటుమనిషి. ఈ జన్మకి తను వచ్చి భర్తతో బస్తీలో కాపురం పెట్టడం అనేది జరగని పని. వస్తే అతనికి ఉద్యోగం ఎవడిస్తాడు? ఏం చూసి ఇస్తాడు?' భర్తకి చదువు లేకపోవడం చాలా చిన్నతనంగా తోచింది. ఇలాంటి సంబంధం కుదిర్చిన తండ్రిని సాధించింది. తన సరదాలూ, ముచ్చట్లూ అన్నీ నాశనమయ్యాయని ఆఖరుకి మనసులోనే దుఃఖపడింది సత్యవతి.

పినతల్లి గారింట్లో పదిహేను రోజు లుంది సత్యవతి. ఈ పదిహేను రోజుల్లోనూ స్వతహాగా బస్తీ వ్యామోహం కల సత్యవతి మోజు మరింత పెరిగిందే కాని తరగలేదు. తన భర్త గడ్డిపరకలా కనిపించాడు. పల్లెటూరి సంసారం, తను పల్లెలో పుట్టి పెరిగినదయినా ఏమాత్రం నచ్చలేదు. విధిలేక తప్పని సరి అయి వదలలేక వదలలేక వచ్చింది అత్తగారింటికి.

అత్తగారింటికి వచ్చినదగ్గరనించీ చాలా ముభావంగా ఉండసాగింది. అసలే అంతంతమాత్రం తోటికోడలితోనూ, అత్తగారితోనూ మాట్లాడటం. ఇప్పుడిక మరీ పలుకే బంగారమయి పోయింది.

అన్ని పనులూ జయలక్ష్మి చక్క దిద్దుతుంది గనుక సరిపోయింది. లేకుంటే

సూరమ్మ పని ఇరుకున పడివుండేది సత్యవతితో. .

బస్తీ నించి వచ్చాక మరీ మాట్లాడటం తగ్గించేసిన భార్యని చూచి చక్రపాణి కాస్త చిన్నబుచ్చుకున్నాడు. ఇన్నాళ్ళయినా ఇంకా సిగ్గేమిటి? ఇక్కడ అలవాటు కాకపోవడం ఏమిటి? అనుకున్నాడు.

చక్రపాణి పైకి ఎంత మొరటు మనిషిలా కనిపిస్తాడో అతని భావాలు, మాటలు అంత సున్నితమైనవి. సత్యవతంటే అతనికి తగని ప్రేమ. ఏం పని చెబితే ఎక్కడ చిన్నబుచ్చుకుంటుందో అనుకుని ఏ పనీ చెప్పేవాడుగాదు. భార్య తనకి అవీ ఇవీ అందిస్తూ కలసి మెలసి తిరుగుతూ సరదాగా వుండాలని అతని కోరిక. సత్యవతి ఏమనుకుంటుందో అని ఆమెకి పురమాయించడానికి బిడియపడి తన పనులన్నీ తనే చేసుకుంటూ వుండేవాడు.

కోడలు వచ్చినా కొడుకు తన పనులన్నీ తనే చేసుకోవడం సూరమ్మకి కష్టంగానే వుండేది. కనీసం కాళ్ళు కడుక్కునే నీళ్ళన్నా అతను వచ్చేసరికి ఎదురు వచ్చి అందించని తోటికోడలు వింత స్వభావానికి లోలోనే ఆశ్చర్యపోయేది జయలక్ష్మి.

"జయలక్ష్మి మాత్రం పరాయిపిల్లగాదూ ! ఎంత ఒద్దికగా కలిసిపోయింది తమ కుటుంబంలో" అని రోజూ అనుకుంటూ వుండేది సూరమ్మ.

సత్యవతి కాపురానికి వచ్చి ఆరు నెల్లయింది. పెళ్ళయిన నాలుగు నెలలకే జయలక్ష్మికి నెల తప్పింది. సత్యవతికింకా కడుపు రాలేదేమిటా అని బాధ పడుతూ వుండేది సూరమ్మ. చిన్నాడి కడుపున ఓ కాయ గాస్తే చూసి అలా యాత్రలు చేసివద్దాం అనుకుంటూ వుండేది.

"రోజూ తులసిపూజ చేసుకోమ్మా" అని చెబుతూ వుండేది సూరమ్మ మొదట్లో.

ఇప్పుడు "రోజూ సాయంత్రం ఆంజనేయస్వామి గుడిలో ప్రదక్షిణాలు చేసిరా ! గాలి దోషాలన్నీ పోయి పిల్లలు పుడతారు" అని చెప్పడం ప్రారంభించింది.

ఇది మరీ చిరాగ్గా వుండేది సత్యవతికి. "పుడతారు లెండి. వెధవ పిల్లలకోసం అంత కంగారెందుకు ? పుట్టకపోతారన్న భయం దేనికి ?" అంది సత్యవతి కాస్త కోపంగా. సూరమ్మ చాలా నొచ్చుకుంటూ "వెధవ పిల్లలు అనకమ్మాయి ! పిల్లలు లేందే ఇంటికి నిండుదనం రాదు. గొడ్రాలులా వుంటే నీకుమాత్రం ఏం ఆనందం ?" అంది.

"నాకుమాత్రం పిల్లలకోసం ఇప్పటినించే ఏం ఆరాటం లేదు" అంది కచ్చితంగా.

ఏ మాట అన్నా కోడలు తేలిగ్గా కొట్టిపారేయడంతో పాపం చాలా చిన్న

టుచ్చుకుంది సూరమ్మ. దానికితోడు కనబడ్డ ప్రతి ఆమె "కోడలు నీళ్ళోసుకుందా ?" అని అడగడం, "ఇంకా లేదు" అని సూరమ్మ కాస్త దిగులుగా జవాబివ్వడం, వింటూన్న సత్యవతికి ఒళ్ళుమండి పోయింది.

అడిగినదానికి తప్ప కలుపుగోలు తనంగా వుండని సత్యవతి అంటే చక్రపాణికి కాస్త బాధగానే వుండేది. అతని స్వభావం వేరు. పొలంలో పనిచేసుకుంటున్నా భార్య అనురాగం, చిలిపి పలుకులు గుర్తుచేసుకుంటూ హుషారుగా వుండాలని తాపత్రయపడేవాడు.

తన కన్నివిధాలా తోడునీడగా,కంటిపాపలా చూసుకుంటూ, తన ప్రేమ వాహినిలా ముంచెత్తి పరవశత్వం కలిగించే విధంగా తన భార్య ఉండాలని అతని ఆకాంక్ష. మొదట్లో సిగ్గని సరిపెట్టుకుంటూ ఆ సిగ్గుని వదలగొట్టాలని చనువుగా ఉండేవాడు. గదిలోకి రాగానే ఆమెని తటాలున మీదకి లాక్కుని, బుగ్గలపై ముద్దుల వర్షం కురిపించేవాడు. లాలనగా తన కౌగిలిలో బంధించేవాడు. అతని దురదృష్టం ఏమోగాని సత్యవతికిమాత్రం శుద్ధ మోటుతనం అనిపించేది. అతని ఆవేశం ఆమెకి ఎబ్బెట్టుగా ఉండేది. "మరీ అంత గదిలోకి వచ్చీ రాగానే ఏమిటంత తొందర" అని గింజుకునేది.

రాను రాను భార్య ముభావంతో అతనిలో ఆవేశంకూడా జారిపోసాగింది. ఏమాత్రం సుముఖత్వం చూపని భార్యతో అతడుమాత్రం ఏం సరసాలాడతాడు ? చివరికి పడక టింట్లో కూడా భార్య విషయంలో చాలా జాగ్రత్తగా మసులుకోవడం నేర్చుకున్నాడు.

రాను రాను సత్యవతికి ఆ సంసారమూ, ఆ మనుష్యులు అంటేనే ఏవగింపు కలిగింది. వారి తిళ్ళు, రోజూ అమ్మవార్లలా ఇంత పసుపు ముఖానికి పులుముకుని బావి దగ్గర రెండు చాదలు నీళ్ళుతోడుకుని పోసుకుంటూ ఉండే అత్త, తోటికోడలు, పొలం, వ్యవసాయం అంటూ ఓ సినిమాలు, ఓ సరదాలూ అంటూ లేక ఎద్దులా చాకిరీ చేసే భర్త. వాళ్ళ పాట్లేవో వాళ్ళు పడకుండా 'నువ్వుకూడా వచ్చి నూతిలో రెండు చేదలు తోడుకొని తడిబట్టలతో తులసి ప్రదక్షిణాలు చేయి. సాయంత్రం కోవెలలో ప్రదక్షిణాలు చెయ్యి' అని తనకి హితబోధ చేయబోవడం, మామగారు, బావగారు ఇల్లెగిరిపోయేలా పెట్టే గురకలు, ఇవన్నీ ఆమెకి పరమ రోతని కలిగించాయి. 'అబ్బ ! ఈ అడవి మనుష్యుల మధ్యనించి అవతలపడితే బాగుండు' అని మనసులో అనుకోసాగింది.

"తనెలాగూ టెన్త్ ప్యాసయింది.

పిన్నిగారింట్లో ఉండి ఇంటరులో చేరితే బాగుండు. ఈ చదువురాని, పొలాల్లో పడి తిరిగే మట్టి మనిషితో ఎలా సంసారం చేయడం ?" అని పగలూ, రాత్రిళ్ళూ అదే పనిగా ఆలోచించ సాగింది. చివరికి 'ఈ భర్త, ఈ సంసారం వదిలి తను స్వతంత్రంగా బ్రతకాలి' అనే నిశ్చయానికి వచ్చింది సత్యవతి

అప్పటికి చక్రపాణితో సత్యవతికి వివాహమయి ఏడాది కావస్తోంది. 'ఎలాగో ఏడాది ఓర్చుకున్నాను. ఇంక చాలు బాబోయ్' అనుకుంటూ,

"నేను మా పిన్నిగారింటికి వెళ్ళి వస్తాను" అంది భర్తతో.

'క్రిందటిసారి బెజవాడ వెళ్ళి వచ్చి అంతక్రితం మాట్లాడే మాటలు కూడా మాట్లాడటం మానేసింది. ఇంకోసారి పూర్తిగా తనతో మాట్లాడదేమో !' అని బాధగా అనుకున్నాడు చక్రపాణి. 'అయినా పంపితే, పోనీ కాస్తయినా, నా మంచితనం గ్రహించి తిన్నగా ఉంటుందేమో' అన్న ఆశతో ఒప్పు కున్నాడు చక్రపాణి.

'అమ్మయ్య ! ఇక్కడొక గండం గడిచిపోయింది' అని ఆనందించింది మనసులో.

3

మంచిరోజు చూసి పంపించాడు చక్రపాణి. కూడా తను వస్తానన్నా, "ఫర్వాలేదు వెళ్ళగలను లెండి" అని సమాధానం ఇచ్చి ఒంటరిగానే బయలు దేరింది సత్యవతి.

'పుట్టింటికి వెడతానంటే అర్థం ఉంది. ఎక్కడో ఉన్న పిన్నమ్మ ఇంటికి ప్రత్యేకంగా బయలుదేరడం ఏమిటి ?' అని అనుకున్నారు సూరమ్మ, జయలక్ష్మి పైకి ఏం అనక పోయినా.

అలా వెళ్ళిన సత్యవతినించి చక్ర పాణికి ఉత్తరం అందింది నాలుగో రోజుకి.

చక్రపాణిగారికి,

మీతో నేను సంసారం చేయలేను. నాకు మీరూ, మీ ఇంటి అలవాట్లూ, పద్ధ తులు బొత్తిగా సరిపడలేదు. సరిపడదు కూడాను. ఎన్ని విధాల ఆలోచించినా కలవని మన మనసులతో లోకంకోసం సంసారం సాగించడం వంచించుకోవ డమేనని నా ఉద్దేశం. మీ అభిరుచులకి, మీ మనస్తత్వానికి సరిపడిన పిల్లని, మీ అమ్మగారికి నచ్చేవిధంగా తులసి పూజలు, గుళ్ళో ప్రదక్షిణాలూ చేయ గల అమ్మాయిని, మీ వదినగారితో సమానంగా తెల్లవారుజామున లేచి పాచి పన్ల దగ్గరనించీ చేయగల పనిమంతు రాలిని చూసి పెళ్ళిచేసుకోండి. నాకు ఏ అభ్యంతరమూ లేదు. సరిగదా ఉపకారంక్రింద భావించి ఆనందిస్తాను.

సత్యవతి.

ఆ ఉత్తరం చూసి ముందు తెల్ల బోయాడు చక్రపాణి, ఆ తర్వాత కోపంతో ముఖం ఎర్రబడింది. మరో సారి, మరోసారి చదివాక కొంచెం తమాయించుకుని ఆలోచనలో పడి పోయాడు. ఎక్కడనించి ఆ ఉత్తరం? అని అడిగిన తల్లితో క్లుప్తంగా చెప్పాడు చక్రపాణి. సూరమ్మ నిలువునా నిశ్చేష్ట రాలయింది. చిన్న విజయలక్ష్మి అదిరి పోయింది. తోటికోడలి కెంత తెగింపు? అని ఆశ్చర్యపోయింది. "ఏదో కోడలు గదాని చనువుకొద్దీ ప్రదక్షిణాలు చేయమని, తులసీదేవికి పూజచేసుకో మని చెప్పాను. అంతమాత్రానికే అంతంత ఉత్తరాలు రాయాలా ?" అంది సూరమ్మ.

చక్రపాణి మాట్లాడలేదు. "తనంత మురిపెంగా చూసుకుంటేనే మీకూ, నాకూ సరిపడదని అనేసింది. ఇక తల్లి మాట లెక్కేముంది ? ఇష్టం అయితే చేసుకోవచ్చు. లేకపోతే మానేయొచ్చు. పెద్దవాళ్లు గనక ఏదో మంచి అను కున్నవి తమ దృష్టిలో ఉన్నవి చెబుతూ ఉంటారు. దానికింత రాద్ధాంతమా ?"

కామయ్య వచ్చాక విషయాలన్నీ చెప్పేసింది సూరమ్మ. వింటూనే మండి పడ్డాడు. చిన్న చలపతీ కోపగించాడు. ఏటిమి ఈవిడ చదువు ! ఏమన్నా బి. ఏ. లు చదివిందా, యం. ఏ. లు చదివిందా ! వాడికంటే ఏదో రెండు క్లాసు లెక్కువ ఏడిసింది. దానికింత పొగరా ! నీతో సంసారం చెయ్యను అని తెగేసి చెబుతుందా ! పైగా మరో పిల్లని చూసుకోమని సలహా ఇస్తుందా ? చేస్తాను, దీని బాబులాంటి పిల్లను తెచ్చి చేస్తాను. ఏమనుకుందో !" అంటూ కోపంతో బుసలుకొట్టాడు కామయ్య.

ఆ తెల్లవార్తూనే వియ్యంకుడికి కబురు పెట్టాడు కామయ్య. వెంటనే పరిగెత్తు కుంటూ వచ్చాడు రామయ్య. రామ య్యని చూస్తూనే సత్యవతి రాసిన ఉత్తరం గిరాటేసాడు ముఖం గంటు పెట్టుకుని.

ఉత్తరం చదివి నిలువునా నిర్ఘాంత పోయాడు రామయ్య ! కూతురు ఎంత పనిచేసింది ! పరువుగా, గుట్టుగా బ్రతికే సంసారాలలో తలవంపులు తెచ్చింది. కోడ లిలా చేసిందని కామయ్యని, కూతు రిలాంటి పనిచేసిం దని తననీ దుమ్మెత్తిపోయారూ అంతా! దౌర్భాగ్యురాలు. మనసులో తిట్టుకుంటూ "ఏదో చిన్నపిల్ల. తెలిసీ తెలియని రాతలేవో రాసింది. నేను వెళ్ళి కనుక్కు వస్తాను" అన్నాడు రామయ్య సర్దిపుచ్చే ధోరణిలో.

"చిన్నపిల్ల అంటావేమయ్యా ! ఇవి చిన్నపిల్లల రాతల్లాగే వున్నాయా ?" అన్నాడు కామయ్య మండిపడుతూ.

ఇక వియ్యంకుడు ఏం చెప్పినా

వినదని గ్రహించిన రామయ్య "నేను వెళ్ళి విషయం కనుక్కొ వస్తాను" అంటూ లేచాడు.

"వెళ్ళు వెళ్ళు ! తొందరగా వెళ్ళి విషయం కనుక్కురా ! కనుక్కొని వచ్చి ఏ సంగతీ చెప్పిపో ! మా అబ్బాయికి రేపీపాటికి పెళ్ళి చేస్తాను" అంటూ విదిలించుకుంటూ లోపలికి వెళ్ళిపోయాడు కామయ్య.

తిన్నగా బెజవాడ వెళ్ళాడు రామయ్య. తన ఉత్తరం అందాక గొడవలు రేగుతాయని, తన తండ్రో, బావో ఎవరో రాకపోరని అనుకుంటూనే ఉన్న సత్యవతి తండ్రిని చూసి ఏమీ భయపడలేదు.

"ఏమే, నీకేమన్నా బుద్ధి ఉందా లేదా ! ఏమిటా పిచ్చి ఉత్తరాలు, తిన్నగా సంసారం చేసుకోక ?" రౌద్రంగా అడిగాడు రామయ్య.

"నా కతనితో సంసారం చేయడం ఇష్టంలేదు." తెగేసినట్లు చెప్పింది సత్యవతి.

"ఏం ? ఏ మొచ్చింది నీకు మాయ రోగం, అతనితో కాపురం చేయక పోవడానికి ?''

"అతని మోటుతనం, ఆ ఇంటి పద్ధతులూ నాకేం నచ్చలేదు. చదువూ సంధ్యా రాని ఆ గబ్బిలాలతో ఎవడు చేస్తాడు కాపరం ?" విదిలించినట్టే అడిగింది.

"ఆ ! చదివిన మొనగత్తె పెద్ద బయలుదేరింది ! తిని కూర్చుని అరగక ఇష్టంవచ్చినట్లు అనుకుంటున్నావు. నిక్షేపంలాంటి కుర్రాడిని పట్టుకుని మోటువాడంటావా ?" నిప్పులు కురిసే కళ్ళతో అడిగాడు రామయ్య.

"ఆ నిక్షేపంలాంటి కుర్రాడిని మరో నిక్షేపంలాంటి సంబంధం చేసు కోమను. ఎవడొద్దన్నాడు ? నాకేం అతనక్కర్లేదు."

"చేసుకుంటాడు. ఎందుకు చేసు కోడు. రేపీపాటికి వాళ్ళ నాన్న సంబంధం కుదిర్చి పెళ్ళిచేశాడంటే నీకు నష్టంగాని అతనికేమీ నష్టం లేదు."

"నాకూ ఏం నష్టంలేదు. హాయిగా చదువుకుంటాను. స్వతంత్రంగా ఉద్యోగంచేసి నా పొట్ట నేను పోసు కుంటాను. సరిపడని వాళ్లతో సంసా రాలు ఈదుతూ కూప స్తమండూకంలా నేనేం పడిఉండ దల్చుకోలేదు." మొండిగా జవాబిచ్చింది సత్యవతి.

"నీకు అన్నీ ఇలాంటి బుద్ధులు పుడుతున్నాయి ఏం తెగులు ? మొగుణ్ణి వదిలి చదువుకుని ఉద్యోగాలు వెలగ బెడతానంటా విదేం పోయేకాలం ?"

"చ దు వు కుం టా న ం టే పోయే కాలమా ?"

"అసలు నిన్ను చదివించే దెవరు?"

"పోనీ ! నువ్వు చదివించకపోతే

మానే, ఏదో ఉద్యోగంచేసుకుంటూ నేనే చదువుకుంటాను."

ఎన్ని విధాల నచ్చచెప్పినా సత్యవతి పట్టిన పట్టు విడువకపోవడంతో హతాశుడై ఇల్లు చేరుకున్నాడు రామయ్య, పరువు ప్రతిష్టలన్నీ తగలడిపోయాయే అని బాధపడుతూ. మళ్ళీ కామయ్య ముఖం చూడలేక మరో మనిషిద్వారా కబురుచేశాడు, ''కూతురు రావడానికి ఇష్టపడటంలేదని."

ఏ మూలో మిణుకుమిణుకుమంటున్న ఆశ కాస్తా ఆరిపోగా బుర్ర ఖాళీ అయిపోయింది చక్రపాణికి.

కామయ్య కోపంతో వూగిపోతూ "రేపీపాటికి దీనికంటే చదువుకున్న దాన్ని, చక్కనిదాన్ని తెచ్చి నా కొడుక్కి పెళ్ళిచేయకపోతే నా పేరు కామయ్య కాదు" అని భీకరంగా ప్రతిజ్ఞ చేసాడు. ప్రతిజ్ఞ చేయడమేమిటి ? ఎరుగున్న వాళ్ళందరికీ కొడుక్కి సంబంధం కావాలని,కట్నంతో నిమిత్తం లేదని చెప్పి సాధ్యమయినంత తొందరగా పిల్లని కుదర్చమని హెచ్చరించాడు కూడా.

చక్రపాణి కాస్త భయపడ్డాడు. ఒక పెళ్ళి ఇలా పేలాలు వేగింది. మరో పిల్ల వచ్చిమాత్రం సరిగ్గా ఉంటుందా ? సత్యవతే కాపురం చేయలేనంటే అంతకంటే ఎక్కువ చదివింది వెలగబెడుతుందా, తండ్రి పిచ్చిగాని. అసలా పిల్ల కాపురానికే రాకుండా బిగుసుకుపోతుందేమో." ఇలా అనుకుంటూ మధనపడసాగాడు చక్రపాణి.

కాని ఇందులో ఏ ఒక్కటీ పైకి అనలేదు. ఏ మూలో పురుషాభిజాత్యం. మళ్ళీ పెళ్ళిచేసుకోకపోతే పౌరుషహీన మనిపిస్తోంది. వాజమ్మలా పెళ్ళాం వదిలేసిందని పదిమందిచేత అనిపించుకుంటూ బ్రతకడం అసంభవమని, పరువుప్రతిష్టలకి భంగమని తోచసాగింది. అంతరాంతరాళంలో మంచి పిల్ల దొరక్కపోతుందా అన్న ఆశ,దొరకాలన్న కోరిక కూడా వుండకపోలేదు.

కామయ్య కార్యసాధకుడు. పది రోజుల్లోనే బెజవాడ పిల్లనే కుదుర్చుకున్నాడు.

పిల్ల పేరు పద్మజ. ఇంటర్మీడియట్ పాసయింది. ఆర్థికస్తోమత లేక తండ్రి చదువు ఆపించేసాడు. పిల్లని కామయ్య, చక్రపాణి ముందు వెళ్ళి చూసివచ్చారు. పద్మజ పేరుకు తగ్గట్టు అందంగా ఉంది. సత్యవతికన్నా మంచి ఛాయే !

చక్రపాణికి బాగా నచ్చింది. కామయ్యకి కావలసింది సత్యవతికన్నా ఎక్కువ చదివింది. ఎక్కువ అందమైంది. ఆ రెండూ పద్మజలో ఉన్నాయి. ఇంక వేరే అత నేమీ ఆలోచించలేదు.

సూరమ్మ, జయలక్ష్మి, చలపతి, రామలక్ష్మి, భూపతి అంతా మరోసారి

వెళ్ళి చూసివచ్చాక తాంబూలాలు పుచ్చుకుని లగ్నం నిర్ణయించడం జరిగి పోయింది.

కావాలనే రామయ్యకో శుభలేఖ పంపాడు కామయ్య, అది చూసిన రామయ్యకి కత్తివేటుకు నెత్తురుచుక్క లేకుండా పోయింది. కూతురి మొండి తనానికి, తన దౌర్భాగ్యానికి మనసు లోనే ఏడిచి వూరుకున్నాడు.

ఈసారీ పెళ్ళి ఘనంగానే చేశాడు కామయ్య. "మంచి శాస్తి చేశారు లేక పోతే ఆ పిల్ల కంత పొగరా ! ఇంతోటి ఛదువుకీ అంత అహంకారమా ?" అంటూ కామయ్య చర్యని ప్రతివారూ పొగిడారు, రామయ్య కూతురిని ఏరి పారేస్తూ.

"మొత్తానికి మొగాడి ననిపించా వోయ్ ! లేకపోతే అంత గర్వమా ఆడదానికి మా అందరి పరువూ నిలిపావు" అని చక్రపాణిని అభినం దించారు.

4

చక్రపాణికి పెళ్ళయిందని తెలిసి తేలిగ్గా నిట్టూర్చింది సత్యవతి. మంగళ సూత్రాలు రెండూ తీసి కవర్లో పెట్టి పార్సెల్‌చేసి మరీ పంపింది, ఇక అతనితో ఏ సంబంధమూ ఉండ దన్నట్లు. అందుకున్న చక్రపాణి ఈసారి ఆశ్చర్యపోలేదు. పైగా కాస్త సంతోషించాడు కూడా.

కూతురు భర్తని వదిలి వెళ్ళిపోయిం దన్న వార్తతో వూరంతా గుప్పుమని విడ్డూరంగా చెప్పుకుంటూ రామయ్య కనిపిస్తే, "కూతురికి బుద్ధిచెప్పడం చేత కాని చవట అని గుసగుసలుపోతూ ఎకసక్కెంగా ఏదో ఒక మాట అంటూ ఉంటే తల ఎత్తుకుని తిరగలేని రామయ్య కూతురు చదువుకి డబ్బు పంపడానికి నిరాకరించాడు.

టైపు ఇన్‌స్టిట్యూట్‌లో చేరింది సత్యవతి, పిన్నిగారింట్లోనే ఉండి. అనసూయకి కూడా సత్యవతి చర్య సమర్థనీయంకాక, అటు మరీ ఏమీ గట్టిగా అనలేక లోలోనే విసుక్కో సాగింది. ఒక నెలరోజులు ఉండేసరికి పిన్నికి తన ఉనికి ఏమాత్రమూ ఇష్టం లేదని గ్రహించిన సత్యవతి వేరే గది వెతుక్కోసాగింది. త్వరగానే గది కూడా సంపాదించుకుంది.

సత్యవతి వేరే గది తీసుకుని వుంటోందన్న వార్త విని రామయ్య తెల్లబోయాడు.

"అతగా డెలాగూ పెళ్ళిచేసుకోనే చేసుకున్నాడు. జరిగిందేదో జరగనే జరిగింది. మన పిల్లని మనం వెలివేసు కోవడం దేనికి ? దానివల్ల దాని బతుకు ఎటూ కాకుండా పోతుంది. చదువు కుంటా నంటోంది, చదివించండి. దానికి నచ్చిన చదువుకున్నవాడు దొరికితే ముడిపెట్టవచ్చు, ఆ వూళ్ళోనే ! ఇక్కడికి

తీసుకుని కూడా రాకుండా" అంటూ పోరసాగింది కనకమ్మ. ముందు కాదు కూడదని భీష్మించుకుని కూర్చున్నా రానురాను భార్య మాటల్లో నిజం లేక పోలేదని గ్రహించి కాస్త డబ్బు ఇచ్చి పంపాడు భార్యని.

కొన్ని ముఖ్యావసర సామానులు తీసుకుని కూతురును చూడటానికి వచ్చింది కనకమ్మ.

టైపు నేర్చుకుంటున్న కూతురుకి అన్ని ఏర్పాట్లూ చూసి జాగ్రత్త అంటూ పదిమాట్లు హెచ్చరించి అనసూయకి కూడా కనిపెట్టి ఉండమని బతిమాలి చెప్పి తిరిగి వచ్చేసింది. తన కోరిక లన్నీ నిర్విఘ్నంగా నెరవేరుతున్నం దుకు సత్యవతి మనసులోనే నమస్క రించింది, భగవంతుడికి. నిర్విచారంగా టైపు నేర్చుకోవడం ప్రారంభించింది. సత్యవతి ప్రవర్తనతో కళ్ళు తెరచిన రామయ్య మూడో కూతురు రత్న కుమారికి బస్తీ సంబంధమే కుదిర్చాడు. వరుడు జయరాం నాజూగ్గా పాంటూ, షర్టుతో తిరుగుతూ ఏదో చిన్న వ్యాపారం వెలిగించడం రత్నకుమారికి పరమానందం కలిగించింది.

చదువు పెద్దగా నేర్వకపోయినా చూపులకి బాగుండటంతో పెళ్ళికి వచ్చిన సత్యవతికీ నచ్చాడతను. చెల్లెలికి మంచి మొగుడే వచ్చాడనుకుంది మనసులో.

* * *

చక్రపాణి భార్య పద్మజ కాపురానికి వచ్చింది. సత్యవతితో జరిగిన అను భవంతో చదువుకున్న పిల్లలకి ఏంచెబితే ఏంతంటా వస్తుందోనని చాలా జాగ్ర త్తగా మాట్లాడటం నేర్చుకున్నారు సూరమ్మా, జయలక్ష్మి.

కాపురానికి వచ్చిన మూడో రోజు కల్లా ఆ యింటి పద్ధతులు ఆకళింపు చేసుకుంది పద్మజ. అత్తగారు, తోటి కోడలుతోపాటు సమానంగా తనంతట తనే లేవడం మొదలుపెట్టింది. ఏదన్నా పని అందుకుని చేయడం కాస్త ధైర్యం కలిగించింది సూరమ్మకి.

భర్త లేచేసరికి తను స్నానంచేసి వచ్చేది. భర్త మొక్కలన్నీ పరీక్షిస్తూ ఉంటే తనూ ఎండుటాకులు తీసి వేయడం, నీళ్ల కడవలతో తెచ్చి అందిం చడం ప్రారంభించిన పద్మజ ఒక్కో నాడు భర్త లేవకుండానే తనే ఆ పనులు చేయడం కూడా అలవాటు చేసుకుంది. చక్రపాణికి ఎంతైనా సంతోషం కలిగింది.

సాయంత్రం అయ్యేసరికి జాజి పూలూ, కనకాంబరాలు, మరువం, దవనం అన్నీ కలిపి పెద్దదండ పద్మజే కట్టి తోటికోడలికి, ఆమె కూతురికి, అత్తగారికి కూడా తనే ఇచ్చింది.

"పద్మా ? భోజనం చేశావా ?" పొలంనించి వస్తూనే అడిగాడు చక్రపాణి.

చదువుతున్న పుస్తకం మూసి "మీరు రాలేదుగదా ! మీ కోసమే ఎదురుచూస్తున్నాను" అంది చిరునవ్వు నవ్వుతూ.

"అయ్యో ! తొమ్మిదయిపోయింది. ఇంతవరకూ నాకోసం ఎందుకు కని పెట్టుకుని ఉండటం ? నువ్వు తినేయ లేకపోయావా ?" అన్నాడు నొచ్చు కుంటూ. పద్మజ నీళ్ళుపెట్టడానికి వెళ్ళింది పెరట్లోకి.

"చెబితే వినలేదురా ! 'ఆయన రానీయండి ఇద్దరం తింటాము' అంటూ కూర్చుంది." సూరమ్మ అందుకుంటూ వావిచ్చింది.

"రండి, స్నానానికి నీళ్ళు తోడాను" అంటూ తిరిగి వచ్చింది పద్మజ.

టవలు, సోపూ తీసుకుని భర్త వెనకాలే వెడుతూ "మన దొడ్లో మల్లె పందిరికూడా వేస్తే బాగుంటుందికదూ!" అంది.

"అవును. వేద్దామనుకుంటూనే అశ్రద్ధ అయింది. రేపు తెప్పిస్తాను. నీకు మల్లెపూవులంటే ఇష్టమా ?" అన్నాడు నవ్వుతూ చక్రపాణి.

"మల్లెలంటే ఎవరి కిష్టం ఉండదు?" చిలిపిగా అంది.

గబగబా రెండు చెంబులు మీద గ్రుమ్మరించుకుంటున్న భర్తని చూసి "ఏమిటా పోసుకోవడం,ఇదుగో సబ్బు! వంగోండి, వీపు రుద్దుతాను. అసలే మట్టిలో తిరిగివస్తారు" అంది పద్మజ.

చక్రపాణి వంగున్నాడు. పద్మజ వీపు రుద్దుతూంటే సున్నితమైన ఆమె చేతి స్పర్శ అతనికి ఎంతో హాయని పించింది.

"అయిందా ?"


"అప్పుడేనా ! కాస్త కూస్తా? ఎకరం న్నర ఉంది మీ వీపు. తోమద్దా" అంది పెదాలు బిగించి నవ్వుకుంటూ.

చక్రపాణి ఫక్కున నవ్వాడు పద్మజ మాటలకి.

అతని స్నానం పూర్తయింది. టవలు, లుంగీ అందించి లోపలికి వెళ్ళింది. భోజనాల గది అంతా శుభ్రం చేసి పీటలు వాల్చి కంచాలు పెట్టింది పద్మజ.

కామయ్య, చలపతి, చక్రపాణీ ముగ్గురూ ఒక్కసారే కూర్చుంటారు భోజనాలకి మధ్యాహ్నంపూట. వాళ్ళ య్యాక ఆడవాళ్ళు తింటారు. సత్యవతి ఇచ్చిన డోసుకు హడలిపోయిన సూరమ్మ భర్త విస్తట్లోనే భోజనం చేయమని చెప్పలేదు పద్మజకి. పుట్టింటి వారిచ్చిన తన కంచంలోనే తను తింటుంది పద్మజ.

రాత్రిళ్ళు మాత్రం అరగదని కామయ్య, సూరమ్మ పెందరాడే భోజనం చేస్తారు. చలపతి వచ్చాక జయలక్ష్మి తింటుంది. ఆఖరున వచ్చే



చక్రపాణికి సూరమ్మ వడ్డిస్తుంది రోజూ. సత్యవతి ఉన్నన్నాళ్ళూ జయలక్ష్మి, చలపతి తిన్నా తినకున్నా సరిగ్గా ఎనిమిదింటికి భోజనం చేయడం ఆమెకి అలవాటుంది కనుక అలాగే తిని లేచేది.

చివరికి మిగిలిన చక్రపాణి, పద్మజ తామే వడ్డించుకుని తినడం ప్రారంభించారు. పద్మజ వచ్చాక నిద్ర కళ్ళతో భోజనం వడ్డించాల్సిన అవసరం సూరమ్మకి, వంటిల్లు బాగుచేయాల్సిన పని జయలక్ష్మికి తప్పిపోయింది.

భోజనంచేసి వంటిల్లు శుభ్రంచేసుకుని మంచినీళ్లు తీసుకుని భర్త గదిలోకి పద్మజ వచ్చేసరికి దగ్గర దగ్గర పదిన్నర అయింది. తెల్లని చీర, తలలో సువాసన లీనుతూ పూలు ధరించి తన ప్రక్కన కూర్చునే భార్యని చూస్తూనే పరవశించిపోయాడు చక్రపాణి.

ఏనాడూ సగం నిద్రలో కనిపించే సత్యవతి క్షణం అతని మస్తిష్కంలో మెదిలి మాయమయింది. ప్రతి చిన్న పనికీ పద్మజ ప్రక్కన ఉండి సహాయ పడటం అతనికి ఎంతో ఉత్సాహా నిచ్చింది.

పద్మజ మంచినీళ్ళ మరచెంబు స్టూలుమీద ఉంచి, "నిద్రపోతున్నారా?" అంది మెల్లగా. తటాలున ఆమెని మీదకి లాక్కుంటూ "నువ్వు రాకుండానా ?" అనడిగాడు కొంటెగా.

"మీరు నిద్రపోవడానికి నా సాయం కావాలా ?" చిలిపిగా అడిగింది.

"అవును ! జోల పాడవద్దా !"

"సరే ! కళ్ళు మూసుకోండి. జోల పాడుతూ జోకూడా కొడతాను."

"నాకు పాడవల్సిన జోల ఇది" అంటూ సున్నితమైన ఆమె పెదవులను గాఢంగా ముద్దుపెట్టుకున్నాడు చక్రపాణి.

పద్మజ కళ్ళు సిగ్గుతో వాలిపోయాయి క్రిందకు.

ఆ సమయంలో ఎర్రబడిన చెంపలు, క్రిందకి వాలిపోయిన కన్నులు చూస్తూంటే మతిపోయింది చక్రపాణికి.

ఆవేశంతో భార్యని మరింత గుండెలకి హత్తుకున్నాడు. చక్రపాణి కౌగిలిలో కరిగిపోయింది పద్మజ.

ఆ మరునాడు మల్లెమొక్కలు వచ్చాయి ఇంటికి. ఉత్సాహంగా చక్రపాణి, పద్మజ కలసి నాటారు దొడ్లో.

"అబ్బ ! ఈ ఏడు మనకి కావలసినన్ని మల్లెపూలు." సంబరంగా అంది పద్మజ పెట్టడం అయ్యాక.

"ఇంకా నయం! ఇవి వచ్చే ఏడే నీ జడలోకి ఎక్కేది. ఆశకొద్దీ కొమ్మలే పెట్టుకునేట్టుంది నీ వాలకం చూస్తే."

"అంతేనా ! ఈ ఏడు లాభంలేదన్న మాట." కాస్త నిరాశగా అంది.

"ఈ ఏడాది బజారునించి తెచ్చి పెడతాలే ! దిగులు పడకు" అంటూ మందహాసం చేసాడు చక్రపాణి. పద్మజ ముఖం పద్మంలాగే వికసించింది ఆ మాటకి.

సూరమ్మ,జయలక్ష్మి రోజూ సీతమ్మ వారి వేవిళ్లు, అతికాయ యుద్ధం. ఇలా పదాలు పాడుకుంటూ ఉంటారు. ఎప్పుడయినా అధ్యాత్మ రామాయణం కీర్తనలు కూడా పాడుతూ ఉండటం కద్దు. విసుగులేకుండా రోజూ అవే పాటలు పాడుకుంటూ ఉంటే వరసనే నాలుగు రోజులు వినేసరికి పద్మజ "మీరు అవి చిన్నప్పటినించే పాడుకుంటూన్న పదాలేగా, నేను భగవద్గీత చదివి వినిపిస్తాను రండి అత్తయ్యా !" అంది.

ఆ కాస్త మాటకే పొంగిపోయింది సూరమ్మ. రోజూ ఒక అరగంట చిన్న కోడలు భగవద్గీత చదివి వినిపిస్తుంటే విని ఆనందించడం, అప్పుడప్పుడు కామయ్య కూడా చదివించుకోవడం పరిపాటి అయింది.

పద్మజ పమిటకొంగు తిప్పి దోపి కడవలతో నీళ్ళు తెచ్చి మొక్కలకు పోస్తూ ఉంటే నేత్రపర్వంగా ఉండేది చక్రపాణికి.

"నువ్వలా పూలమొక్కలకి నీళ్లు పోస్తుంటే అచ్చం శకుంతలలా ఉన్నావు" అన్నాడు చిరునవ్వుతూ ఒకసారి.

"సరే ! నేను శకుంతల ననుకుంటే అనుకోండి కాని మీరుమాత్రం దుష్యంతుడిలా నన్ను మరచిపోకండి." కొంటెగా భర్తకి జవాబిచ్చింది పద్మజ.

ఆ మాటకి ఉలిక్కిపడ్డాడు చక్రపాణి.

"నిన్ను నేను మరిచిపోతానా ! అసలు నిన్ను వదిలి క్షణం ఉండ గలనా !" గోముగా భార్య కళ్లల్లోకి చూస్తూ అన్నాడు చక్రపాణి.

"అబ్బ ! కవిత్వం కూడా చెప్పేస్తున్నారే !"

"కవిత్వం చెప్పడానికి నేను కవినా ! పెద్ద చదువుకున్నవాడినా ! ఏదో నాకు తోచింది అన్నాను."

వచ్చిన అవకాశం జారవిడువ దలచుకోలేదు పద్మజ. "మీరు పెద్దచదువులు చదవకుండానే కవిత్వం చెప్పేస్తున్నారు.
చదివితే బహుమతులన్నీ మీవే."

"నా కంత అదృష్టం లేదులే" నిరాశగా అన్నాడు.

"ఎందుకలా నిరాశపడిపోతారు ? ఇప్పుడుమాత్రం ఏమయింది ? మెట్రిక్ పరీక్షకి కట్టండి. చక్కగా ప్యాసవు తారు."

"అరవై ఏళ్ళు వచ్చాక చదువుకోక మట్టి కొట్టుకోనా అని ఇప్పుడు నాకేం చదువు ? చదివినా వంటబట్టవద్దూ ?"

"ఎందుకు వంటబట్టదు ? మీ కేమన్నా వయస్సు ముదిరిపోయిందా ! మనకి పొలాలు ఉండబట్టి సరిపోయింది గాని లేకపోతే ఈ వయసులో ఏదో చదువుకుంటూ ఉండక తప్పేదా ? పెద్ద ఉద్యోగాలకోసం ప్రయత్నించక తప్పేదా ?"

భార్య మాటల్లో నిజం లేకపోలేదను కున్నాడు చక్రపాణి.

"ఆ ! నా కా పొలంపనులతోనే సరి పోతుంది. చదివేందుకు తీరుబడి ఏది ?"

"ఉన్న టైమే చాలు. రోజంతా చదవక్కర్లేదు. ఏకాగ్రతతో అరగంట చదివినా చాలు, మీకు వచ్చేస్తుంది."

"చూద్దాంలే."

"చూద్దాంలే అనకండి. కనీసం మెట్రిక్ అన్నా ప్యాసయి ఉంటే మీ మనసుకు మీకే సంతృప్తిగా ఉంటుంది. ఆ సంతృప్తే మీకు ధైర్యాన్నిస్తుంది; ఆ ధైర్యం, ఆత్మవిశ్వాసాలే మనిషిని ముందుకు నడిపించగల కరదీపికలు."

వింటున్న చక్రపాణి కళ్ళింత చేసు కుని చూసాడు భార్య వంక ! పద్మజ

నిజంగా ఎంత వివేకవంతురాలు ? ఇంత చక్కగా చెప్పగల నేర్పు ఆమె కా విద్యే ఇచ్చిందా ! అయితే తను నేర్చుకో వలసిందే ! అ నా డంతా ఆలోచిస్తూనే ఉన్నా డు చక్రపాణి. ఎట్టకేలకు పరీక్షకి కట్టడానికే నిశ్చయించుకుని వస్తూ రెండు పుస్తకాలు కూడా తెచ్చుకున్నాడు కరణంగారి కొడుకు దగ్గర.

తన మాటకి విలువ నిచ్చి వస్తూ పుస్తకాలు తెచ్చుకున్న భర్తని చూసి ఉప్పొంగిపోయింది పద్మజ. అతని మెడ చుట్టూ చేతులువేసి "నాకు తెలుసు ! ఏదన్నా చెప్తే విని అర్థంచేసుకోగల నేర్పూ, దాన్ని ఆచరణలో పెట్టగల స్థైర్యం మీకు ఉన్నాయని" అంది సంతోషంగా.

భార్య ముఖంలో వెల్లివిరిసిన ఆనం దాన్ని, తనపైన ఆమెకున్న సదభి ప్రాయాలని ప్రత్యక్షంగా చూసిన చక్ర పాణి తప్పకుండా పరీక్షకి కట్టి ప్యాస వ్వాలనే అనుకున్నాడు.

ఆమె ఆనందంకోసం ఎంత కష్టమైన పని అయినా సాధించితీరాలన్న దృఢ నిర్ణయానికి కూడా వచ్చాడు.

బెజవాడ వెళ్ళి మరికొన్ని గైడ్లు, పుస్తకాలుకూడా తెచ్చాడు ఆ మర్నాడు.

మంచిరోజు చూసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించాడు చదవడం.

ఉదయం లేచి పనులుచేస్తూ, భర్తని లేపి పుస్తకాలు అందించేది పద్మజ. పూలచెట్ల సంరక్షణ అంతా తనే తీసు కుంది. అతని దంతధావన, స్నానం అన్నీ అయ్యాక తనే అతనికి అన్నం పెట్టేది. భర్త పొలం వెళ్లేదాకా అవీ ఇవీ అందిస్తూ వీధిదాకా సాగనంపి లోపలికి వచ్చి కాస్త టిఫిను, కాఫీ తీసు కుంటుంది పద్మజ.

పద్మజ కూడా ఉదయం చద్దన్నం తినదు. రోజూ మినపట్లు మామగారికి వేస్తుంటే "రోజూ అవేనా అత్తయ్యా ! టిఫిను మార్చుకుంటూ ఉంటే బాగుం టుంది" అని తనే ఒకనాడు ఇడ్లీ, మరో నాడు పూరీ, ఒక్కోసారి పెసరట్టు, ఉప్మా ఇలా చేయడం ప్రారంభించింది.

ఈ మార్పు కామయ్యకి బాగా నచ్చిందనే చెప్పాలి. రోజు కో రుచితో కోడలు చేసిపెడుతూంటే పరమానంద భరితుడయ్యాడు. ఎంతైనా చదువు కున్న పిల్ల ! చదువుకున్న పిల్లే" అని కూడా అనుకోసాగారు.

పొద్దున్నే ఫలహారాలు చేయడం పెద్ద పనిగా ఉండేది సూరమ్మకి. చిన్న కోడలు ఆ బాధ్యత తను స్వీకరిం చడంతో ఆమెకి ఎంతో పని తగ్గిపోయి ప్రాణం తేలిగ్గా ఉన్నట్లు అనిపించింది. మనసులోనే కోడలిని దీవించింది, సంతృప్తిగా.

## 5

కొడుకు మెట్రిక్ పరీక్షకి కట్టాడని విని మొదట ఆశ్చర్యపోయాడు కామయ్య.

"ఇప్పుడు వీడికి చదువేం తలకెక్కుతుంది ?" అన్నాడు సూరమ్మతో.

"ఏమో మరి ! పెళ్ళాం చదువుకోమని పోరింది కావల్ను."

కామయ్య మౌనం వహించాడు. మామగారేమన్నా అడుగుతాడేమోనని సమాధానం రెడీగా పెట్టుకుంది పద్మజ. కాని అతనేం మాట్లాడలేదు.

సబ్జక్టులన్నీ అర్థం అవుతున్నాయి. లెక్కలకి కూడా గైడ్ కొన్నా పద్మజ కోరికమీద ఆ ఊళ్లో రిటైర్డ్ హైస్కూల్ హెడ్మాస్టరు వుంటే కాసేపు లెక్కలు చెప్పించుకుని వస్తూండేవాడు చక్రపాణి. మొదట్లో పుస్తకం పట్టుకోగానే నిద్ర ముంచుకు వస్తుండేది చక్రపాణికి. అది కనిపెట్టి పద్మ 'అలా వెన్నెల్లో మొక్కలు చూద్దాం రండి' అంటూనో, 'కాస్త గాలి తగులుతుంది అలా దొడ్లో తిరిగివద్దాం రండి' అంటూనో బయలుదేర తీస్తుండేది.

పద్మజ ఏం చెప్పినా అతడు కాదన లేడు. అతడు తన భార్య ఎలా వుండాలని, ఎలా ప్రవర్తించాలని కోరుకుంటూ వుండేవాడో అక్షరాలా ఆ కలలకి రూప కల్పన జరిగి పద్మజ రూపంలో సాక్షాత్కరించింది అతనికి.

భార్య చిరునవ్వు, చిలిపి మాటలు, అపర రతీదేవిలా రాత్రిళ్ళు ప్రక్కన పవళించి పరవశింపచేస్తూ అన్నివిధాలా సుఖాన్నందిస్తూన్న తీరు అతనికి గొప్ప ఉత్తేజం ఇస్తుంటే అతనికి ప్రాణంకన్నా మిన్న అయిపోయింది. అత డసలు సత్యవతిని పూర్తిగా మరచిపోయాడనే చెప్పాలి.

ఆరోజు మునసబుగారింట్లో పేరంటం అని పిలిచారు. కోడళ్ళ నిద్దరినీ తీసుకొని బయలుదేరింది సూరమ్మ. మునసబుగారి భార్య ఆప్యాయంగా ఆహ్వానించింది ముగ్గురినీ.

"మీ చిన్నకోడలు మా యింటికి ఎప్పుడూ రాలేదుగా ! ఇదుగో కమలా! పిన్నికి మన ఇల్లంతా చూపించమ్మా !" అంటూ కూతురుని పిలిచింది.

కమల పద్మజ చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకువెళ్ళింది

"ఈ పిల్ల బాగా నిదానస్తురాలల్లే వుందే సూరమ్మా ! ఆ సత్యవతిలా గర్వం లేదు," అంది ఉపోద్ఘాతంగా మునసబు భార్య వర్ధనమ్మ.

"ఛా ! దానికి దీనికి పోలికే లేదనుకో వదినా ! పద్మజకి వినయం, విధేయత, పెద్దలంటే గౌరవం ఎన్ని వున్నాయనుకున్నావు ?" సంబరంగా అంది సూరమ్మ.

"అదృష్టవంతురాలివి. చదువుకున్న పిల్లని, అణకువగల పిల్లనీ తెచ్చుకున్నావు."

"నిజమేనండి ! అబ్బ ! సత్యవతితో మాట్లాడాలంటేనే భయంవేసేది ఏం మాట అంటే ఏమంటుందోనని." జయలక్ష్మి అందుకుంది.

"ఎప్పుడన్నా సత్యవతి మాట ఎత్తుతూ వుంటడా చక్రం ?" ఆరాగా అడిగింది వర్ధనమ్మ.

"అప్పుడప్పుడు వెనక అంటూనే వుండేవాడు. అలాంటి పిల్లని ఎలా మర్చిపోతాము, ఏడాది ఇంట్లోఉందిగా. కాస్తఅక్కసుగానే అంది.

అప్పుడే అటుగా వస్తున్న పద్మజ అత్తగారి ఆఖరిమాట విని నిశ్చేష్టురాల యింది. ఆమె పూర్తిగా అపార్థం చేసుకుంది.

"అంటే సత్యవతి అంటే వీళ్ళందరికీ అంత ప్రాణప్రద మన్నమాట! అయితే సత్యవతి ఎవరు ? తన భర్త చేసుకున్న మొదటి భార్యా ? లేక చుట్టమా ? ఏదో దగ్గర సంబంధం లేకపోతే తన భర్త ప్రత్యేకించి ఆమెని తలపోయాల్సిన అవసరం ఏమిటి ?"

లేని ఉత్సాహాన్ని తెచ్చుకుంటూ పేరంటంలో పాల్గొన్నది. వర్ధనమ్మ పాట పాడమని బలవంతంచేస్తే ఒక చిన్న పాట పాడింది. "తన కోడలికి పాటలు కూడా వచ్చు. కంఠం కూడా బాగుంది," అని మురిసిపోయింది సూరమ్మ, అంతవరకూ ఆమె పాట విని వుండనందున. ఎన్ని చేసినా ఆమె మనసు మనసులో లేదు. తన భర్త హృదయంలో అంత గొప్ప స్థానం సంపాదించిన ఆ సత్యవతి ఎవరు ? తనపై చూపుతున్న ఈ ప్రేమాను రాగాలన్నీ వట్టి బూటకమేనా ? వీళ్ళం దరికీ 'తనంటే ఇష్టం లేదా?' మనసులో తీవ్ర మథనం ప్రారంభమయింది పద్మజకి.

ఇంటికి వచ్చిన వెంటనే తన గది లోకి వెళ్లిపోయి మంచంమీద పడుకుని ఏడుస్తూనే వుంది.

అలవాటుకు విరుద్ధంగా భార్య తన కోసం ఎదురుచూడకుండా గదిలో పడు కోవడం చక్రపాణికి కంగారు కలిగించింది.

"పద్మేది ?" అనడిగాడు తల్లిని వస్తూనే.

"గదిలో వుందిరా ! ఇందాక పేరం టానికి వెళ్ళాము. వచ్చిందగ్గరనించీ అలా గదిలోనే వుంది ?"

"అక్క దెవరన్నా ఏమన్నా అన్నారా ?"

'అబ్బే! ఎవరేమంటారురా దాన్ని?'

"ఆ! మీ ఆవిడకి దిష్టితగిలి వుంటుం దయ్యా" అంది జయలక్ష్మి నిదానంగా.

"మరే! అంతే అయ్యుంటుంది. నాకా మాటే గుర్తురాలేదు. ఉండు, కాస్త దిష్టి తీద్దాము," అంది సూరమ్మ.

"ఏం పద్మా,పడుకున్నావేం? వంట్లో బాగాలేదా?" లాలనగా అడిగాడు

మెల్లగా లేచి "స్నానం చేశారా ? పదండి నీళ్ళు తోడతాను" అంటూ జవాబుకి ఎదురుచూడకుండా దొడ్లోకి వెళ్ళిపోయింది పద్మజ.

చక్రపాణి మరోమాట అడగడానికి

ఆస్కారం లేకపోవడంతో తనూ దొడ్లోకి వచ్చాడు స్నానానికి.

భర్తకి భోజనం వడ్డించి ఏదో తిన్నా ననిపించింది. అన్నీ గమనిస్తూనే వున్నాడు చక్రపాణి. దేనికో ఆమె తీవ్రంగా బాధ పడుతోందనికూడా గ్రహించాడు.

భార్య గదిలోకి రాగానే దగ్గరకి తీసుకుంటూ "ఎందుకలా ముభావంగానూ, దిగులుగానూ వున్నావు ? ప్లీజ్, కారణం చెప్పవా!" అనడిగాడు. ఆప్యాయంగా అడిగే ఆ తీరుకు మరింత వెక్కి వెక్కి ఏడుస్తూ అతని గుండెలమీద వాలిపోయింది! చక్రపాణి భార్య ఏడుపుకు మరింత గాభరాపడిపోయాడు. కాసేపలా ఏడ్చి, ఏడ్చి అతని గుండెలమీదే తల ఆన్చి కళ్ళు మూసుకుంది. భార్య నిద్రపోయిందనుకుని సుతారంగా ఆమెబుగ్గలు ముద్దుపెట్టుకుని దిండుమీద పడుకోబెట్టి తనూ ఆమెప్రక్కనే నడుంవాల్చాడు ఆమెమీద చెయ్యివేసి.

ఒక రాత్రివేళ మెళకువవచ్చి చూస్తే లైటు వెలుగులో పద్మజ కాగితంమీద ఏదో రాస్తూ కనిపించింది. చక్రపాణి గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. పద్మ ఏమిటి రాస్తోంది? 'నేను ఇంక మీతో కాపురము చేయను' అనా ? అది, తనెంత మాత్రమూ భరించలేడు. సత్యవతితో అంతంతమాత్రపు సంసారమే వెలిగించాడు కనుక ఆమె వెళ్ళిపోయినా తనకి బాధనిపించలేదు. కాని పద్మజ! అణువణువూ తన కర్పించి తన శరీరంలో సగభాగమై, తన ఆనందంలో, అనురాగములో మధురమూర్తిలా నిలిచిపోయింది. ఈమె వియోగం తను భరించలేడు. లేద్దాంఅనుకుంటూవుంటే పద్మ రాయడం ముగించి కాగితం మడతపెడుతోంది. అదిరే గుండెని చిక్కబరుచుకుంటూ అలాగే పడుకున్నాడు చక్రపాణి.

కళ్ళు ముఖం, వాచిపోయి ధారాపాతంగా కారే కన్నీటిని తుడుచుకుంటూ ఆ ఉత్తరము భర్త ప్రక్కనవుంచి మెల్లగా తలుపు గడియ తీయబోయింది. రెండు బలమైన హస్తాలు గడియతీయకుండా ఆపుచేశాయి. వెనక్కి తిరిగిచూసి భర్త గుండెలమీదవాలి బావురు మని ఏడ్చింది. ఆమెని అలాగే గుండెల కదుముకుని మంచందగ్గరకి తీసుకువెళ్ళి "ఎందుకు పద్మా వెళ్ళిపోతున్నావు నన్ను వదిలి?" అన్నాడు గద్గదికంగా.

"నేనంటే మీకు ఇష్టంలేదు. ప్రేమ లేదు. నాకు సిరిసంపదలు అవసరంలేదు. నాకు నా భర్త ప్రేమ పరిపూర్ణంగాకావాలి. అందులో ఏమాత్రం తక్కువయినా నా మనస్తత్వానికి సరిపడదు." ఆమె మాటలు వింటూ మరింత గాఢంగా హృదయానికి హత్తుకుని "నీ మీదప్రేమ లేదని ఎందుకనుకుంటున్నావు ? నన్నెందుకు శంకిస్తున్నావు?" అనడిగాడు కంపించే స్వరంతో.

భర్తని మరింతగా అంటుకుపోతూ

"మీరు...మీరు...ఉహు నాకు ఏమా త్రమూ ఇష్టంలేని మాటలను నోటితో అన లేను. మీరు ఉత్తరం చదువుకోండి. నేను కావాలో అక్కర్లేదో చెప్పివేయండి.మీరు నన్ను ప్రేమించలేనంటే నేనింక మన నూతిలోపడి చచ్చిపోతాను. నాకు మీరు కావాలి. మీ ప్రేమాదరణలు పూర్తిగా కావాలి, అంతే, అంతే" అంటూ ఆవే శంగా వెనక్కి పడిపోయింది. పద్మా! పద్మా ! అంటూ ఆమెని కదిపాడు. మెల్లగా కళ్లుతెరచింది. భార్యమీద ఒక చెయ్యివేసివుంచే ఉత్తరం చదువు కున్నాడు. అప్పటికి పూర్తిగా ఆమె మాన సికస్థితి అర్థమయింది. ఒకవిధంగా మనస్సూ శాంతిపడింది.తన పద్మ తనని వదలలేదు. అంతేకాదు తన అనురాగాన్ని పూర్తిగా తనపై నిలుపుకున్న ఆమె, సత్యవతి నీడని, పేరునికూడా భరించ లేదు. అనవసరంగా మనసు పాడుచేసు కుంది. సత్యవతిని ఆనాడే మర్చిపోయాడు తను. "పిచ్చి పద్మా! చదువుకున్నా అడ పిల్ల ననిపించావు. ఎంత అమాయకు రాలివి," అంటూ ఆమెమీద చెయ్యివేసి వులిక్కి పడ్డాడు

పద్మ గజగజ వణికిపోతోంది. ఒళ్ళంతా పెనంలా మాడిపోతోంది. గబ గబా నాలుగుదుప్పట్లు కప్పాడు. తనామె దగ్గరే కూర్చుని మెల్లగా తల నిమర సాగాడు. ఆ జ్వరంకళ్ళతోనే భర్తని చూసి అతనిమీద చేయివేసి పడుకుంది.

ఆ తర్వాత ఆమెకు ఒళ్ళు తెలియలేదు.తెల్ల వారుతూన్నా కోడలి అలికిడి గమనించక సూరమ్మ విస్తుపోయింది.

మెల్లగా చక్రపాణి బయటికివచ్చి "పద్మజకి బాగా జ్వరం వచ్చిందమ్మా! ఒళ్ళుతెలియకుండా పడివుంది."

సూరమ్మ కంగారుగావచ్చి పద్మజ మీద చెయ్యివేసి "అబ్బ! మంగలంలా మాడిపోతోంది. డాక్టరుని పిలిపించరా!" అంది హడలిపోతూ.

కామయ్యనీ, చలపతినీ లేపింది. చక్రపాణి అరగంటలో డాక్టరుని వెంట బెట్టుకువచ్చాడు. "జ్వరం బాగా ఎక్కు వగా వుంది. ఈ మందుబిళ్ళలు గంటకో సారి వేయండి. నుదుట చల్లనిగుడ్డ వేయడం మంచిది. అంతా మెంటల్ వర్రీస్‌వల్లే వచ్చింది. జాగ్రత్తగా చూసు కోండి. మళ్లీ వచ్చి చూస్తాను," అంటూ వెళ్ళిపోయాడు డాక్టరు.

"పద్మజకి అంతా చెప్పివేయాలి. నా అనురాగమంతా నీదే; నా జీవనసర్వ స్వానివి నువ్వే," అని చెప్పాలి. అందాకా ఇంతే! ఆమె క్షోభ, తన బాధా తగ్గవు. ఆ రోజు పొలంవెళ్ళకుండా భార్య ప్రక్కనే కూర్చున్నాడు,డాక్టరు చెప్పిన మందులు శ్రద్ధగా వాడుతూ.

"ఎవరి కళ్లు పడ్డాయో! బంగారం లాంటిపిల్ల మంచానికి అంటుకుపోయింది. వాళ్ళ కళ్లు కాలిపోనూ" అంటూ ఇంత ఉప్పుతెచ్చి దిష్టితీసి పోసింది సూరమ్మ.

పద్మజ ఆ సాయంత్రానికి కాస్త కళ్లువిప్పి చూసింది. గ్లూకోజునీళ్ళు కలిపి తెచ్చింది జయలక్ష్మి. మెల్లగా ఆమెచేత త్రాగించాడు చక్రపాణి.

డాక్టరువచ్చి చూసి ఇంజక్షన్ ఇచ్చి మందులు వాడకాన్ని గురించి మరోసారి వివరించి వెళ్ళిపోయాడు.

"ఏమమ్మా వదినా! కోడలు లేవలేద టగా" అంటూ వచ్చింది ప్రక్కింటామె.

"లేదమ్మా! నిన్నటినించీ జ్వరం. మూసినకన్నెరగదు," అంది సూరమ్మ.

"ఒకవేళ వేవిళ్ళజ్వరమేమో! నెల తప్పిందేమో,తెలుసుకుంటే పోయేదిగా!" అందావిడ తన పాండిత్యాన్ని ప్రద ర్శిస్తూ.

సూరమ్మ మాట్లాడలేదు.కొంచెం ఆగి "ఆ పిల్ల ఒళ్ళెరగకుండా పడివుంది. మరి వాంతులవీ వుండాలిగదా నెల తప్పితే! అలాంటివేమీ కనిపించలేదు. పిల్ల మరీ దిగజారిపోయింది."

"మరే! ఈ పిల్ల మరీ అర్భకురాలు. సత్యవతి ఇంకా కాస్త బొద్దుగా వుండేది గాని, అబ్బే? మరీ సన్నం దేనికీ తట్టుకో లేదు పద్మ"

చక్రపాణి ఈసంభాషణంతా వింటూనే వున్నాడు. మళ్ళీ సత్యవతి పేరు రాగానే పద్మజ ఎక్కడ వింటుందో అని హడలి పోయాడు.

కాసేపేవో తనకి తెలిసినవన్నీ వాగి వాగి సెలవు పుచ్చుకుంది ఆవిడ.

ఆవిడని వెళ్ళనిచ్చి "ఆ సత్యవతి పేరు పద్మజ వినేటట్టుగా ఎవరూ అనకండి." కున్నాడు తల్లితో.

"దానిమాటెవరికి కావాలి నాయనా! ఉన్మన్నాళ్ళూ మహాతీరుగా వుందనా దాన్ని తల్చుకొని మురిసిపోవడానికి? దానికి మా పొడే గిట్టకపోయె."నిరసనగా అంది సూరమ.

"అది పద్మజకింకా తెలియదు. మన మంతా ఇంకా సత్యవతినే అభిమానిస్తు న్నామని, మనకి ముఖ్యంగా నాకు తన మీద అసలు ఇష్టంలేదని పద్మజ ఏవేవో వూహించుకుని జ్వరంతెచ్చుకుంది.రాత్రి నేను కాస్త ఏమరిల్లివుంటే నూతిలోపడి ప్రాణం తీసుకుని వుండేది."

"అయ్యో. అయ్యో! ఎంతపని జరిగి పోయేదిరా! నిండుప్రాణం పోగొట్టుకో వడమేనా! పద్మని ఎందుకు ఇష్టపడం నాయనా! ఏనాడన్నా అది మమ్మల్నొక మాట అందా! మేమన్నామా! పచ్చగా నట్టింట్లో తిరుగుతూంటే సంతోషపడు తున్నాము గాని." గుండెలు బాదుకుంది సూరమ్మ. చక్రపాణి మరేం అనకుండా గదిలోకి వెళ్ళాడు.

పదినిముషాలకి పద్మజ కళ్ళుతెరచి "ఏమండీ!" అంది నీరసంగా.

చక్రపాణి ఆమె ప్రక్కనే కూర్చుని ఆమె నుదుటిమీద చేయివేసాడు.ఆ చేతిని మెల్లగా తీసుకుని తన పెదవులకాన్చు కుంది.మరోనిముషంలో మగతలోకి జారి పోయింది.

"పద్మా! పద్మా!" అని పిలిచాడు. కాని పద్మపలకలేదు.చక్రపాణి కంగారు పడిపోయి "అమ్మా ! ఒక్కక్షణం ఇక్కడవుండు. డాక్టర్ని తీసుకొస్తాను," అంటూ వడివడిగా బయటికి వెళ్ళిపోయాడు.సూరమ్మ ఆదరాబాదరా వచ్చి కోడల్నిచూసి హడలిపోయింది.

"భగవంతుడా ఈ పిల్లని చల్లగా కాపాడు. నీ కొండకొస్తాము," అంటూ ఎదురుగావున్న శ్రీనివాసుడి ఫొటోకి దణ్ణం పెట్టింది, అమ్మాయి జయలక్ష్మీ కాస్త పసుపుగుడ్డతో ఓ రూపాయి డబ్బులు ముడుపుకట్టవే! పిల్ల పరిస్థితి ఏమీ బాగాలేదు." అంది.

ఆ మాటతో కంగారుపడిపోయిన జయలక్ష్మి గబగబా ముడుపుకట్టి తుల సమ్మకి దండాలు పెట్టసాగింది.

డాక్టరు వచ్చి చూసి "ఈ రాత్రి గడిస్తే ఫర్వాలేదు," అన్నాడు ఇంజక్షన్ చేయ డానికి సిద్ధమవుతూ. ఆ మాటకి నిలు వెల్లా కంపించిపోయిన చక్రపాణి "ఎంత డబ్బు ఖర్చయినా సరే ! నా పద్మని దక్కించండి." అంటూ చిన్నపిల్లాడిలా ఏడవసాగాడు.

"ఇది చాలా చిత్రమైన కేసు. మాన సికంగానూ, శారీరకంగానూ చాలా బల హీనురా లీ అమ్మాయి. చిన్న విషయ మైనా విపరీతంగా బాధపడే అతిసున్నిత మైన మనస్తత్వంకల ఇలాంటివాళ్లు శారీరకబలంకూడా తక్కువగావుంటే తట్టుకోవడం చాలా కష్టం.

ఇందుకే ముందుగానే హృదయాకిని దెబ్బతగలకుండా, మీరేం అనకుండా వుండటం నేర్చుకోవాలి. ఆమె మనసు కష్టపెట్టి ఆ తర్వాత బాధపడినా ప్రయో జనంలేదు."అంటూ ఇంజక్షన్ ఇచ్చాడు. మళ్ళీ మందుబిళ్ళఇచ్చి వెళ్ళిపోయాడు.

అదిరేగుండెతో, ఏ క్షణానికి ఏం విపత్తు వస్తుందోనన్న భయంతో తెల్లవార్లూ ఆమెప్రక్కనే కూర్చున్నాడు నిద్రపోకుండా.

తెల్లవారుజామున స్పృహ వచ్చింది పద్మజకి.భర్త తనప్రక్కనే వుండటంతో కాస్త ఉపశమనం కలిగింది. పద్మజ కళ్ళుతెరవడంచూసి కాస్త వూపిరిపీల్చు కుంటూ గ్లూకోజునీళ్ళు కలిపి తనే ఇచ్చాడు చక్రపాణి.

"నిన్న మీరు భోజనంచేసారా?రాత్రి నిద్రపోలేదా?" అనడిగింది పీక్కు పోయిన భర్తముఖాన్ని చూసి.

"మరేం ఫర్వాలేదు పద్మా ! నువ్వు కాస్త తెలివి తెచ్చుకున్నావు. నాకంతే చాలు. అబ్బ! నిన్నంతా ఎంత కంగారు పెట్టావు. కాస్త వదిన్ని కాఫీ కలపమ్మ చెబుతాను," అంటూ వంటగదిలోకి వెళ్ళాడు.

"ఏంనాయనా ! పద్మ కళ్ళుతెర చిందా?"ఆదుర్దాగా అడిగింది సూరమ్మ.

"ఏంరా, అమ్మాయికి తెలివి వచ్చిందా?" అంటూ కామయ్యా,చలపతీ ఒకేసారి ప్రశ్నించారు.

"ఇప్పుడే కాస్త కళ్ళువిప్పింది. వేడి వేడి కాఫీ త్రాగిస్తే కాస్త నీరసం తగ్గి మాట్లాడుతుందని కాఫీకోసం వచ్చాను."

"ఇదుగో నీళ్ళు పెట్టే వుంచాను." అంటూ కాఫీ కలిపి గబగబా గ్లాసులో పోసి ఇచ్చింది జయలక్ష్మి. గ్లాసు తీసుకుని గదిలోకి వచ్చి మెల్లగా ఆమెని లేవదీసి కాఫీ త్రాగించాడు. కాఫీ త్రాగిన వెంటనే వికారం ప్రారంభమై గది బయటికి తీసికెళ్ళమని సంజ్ఞచేసింది.

చక్రపాణిని ఆమె పొదివి పట్టుకుని తీసికెళ్ళి, దొడ్లో కూర్చోబెట్టి చెంబుతో నీళ్ళు తేవడానికి వెళ్ళాడు. భళ్ళున వాంతి చేసుకుంది పద్మజ.

"ఆ మందుబిళ్ళలన్నీ వేసుకునేసరికి పైత్యం చేసాయి కావల్ను," అంది సూరమ్మ కోడలిని చూసి. పద్మజని మెల్లగా లోపలికి తీసుకువెళ్ళాడు చక్రపాణి.

కామయ్య, చలపతి పొలం వెళ్ళిపోయారు. పదినిముషాలకల్లా చలపతి తిరిగివచ్చి సంచీలోంచి డజను బత్తాయిలు, డజను నారింజలు తీసి చక్రపాణి కిచ్చి "రసంతీయించి ఇయ్యి. చాలా డీలా అయిపోయింది," అని చెప్పి మళ్ళీ వెళ్ళిపోయాడు.

చక్రపాణి తనే రసంతీసి ఇచ్చాడు. "మీరు పొలం వెళ్ళరా?" అనడిగింది పద్మజ రసం త్రాగుతూ. "రేపు నీకు కాస్త తేటగావుంటే వెడతాను. ఈ రోజు వెళ్ళను," అన్నాడు ఆమె ప్రక్కనే కూర్చుని. పద్మజ మాట్లాడలేదు. కళ్ళు మూసుకుని దిండుకు చేరగిలబడింది.

డాక్టరు వచ్చి చూసి "ఫర్వాలేదు, గండం గడిచినట్టే! జ్వరంకూడా అంత ఎక్కువలేదు. పాలు, పళ్ళరసం బాగా ఇవ్వండి. ఇప్పుడేమన్నా ఇచ్చారా, లేదా?" అని అడిగాడు.

"కాఫీ త్రాగించాను. వెంటనే వాంతి చేసుకుంది."

"ఐసీ." అని నాడి పరీక్షించి "ఒకసారి లేడీ డాక్టరుకి కూడా చూపించండి జ్వరంతగ్గాక." అంటూ చిన్నగా నవ్వి వెళ్ళిపోయాడు.

ఆ నవ్వులోని ఆంతర్యం వెంటనేపసిగట్టింది పద్మజ. ఆమె కళ్ళు సిగ్గుతో వాలిపోయాయి. డాక్టరుని సాగనంపి వచ్చిన చక్రపాణి, భార్య పెదవులమీద విరిసి మాయమైన చిరునవ్వు గమనించి "ఏమిటి పద్మా! నీలో నువ్వే నవ్వుకుంటూ అంతలోనే చిన్నబోతున్నావు," అన్నాడు ప్రేమగా భార్యకళ్ళలోకి చూసి.

ఒక్క క్షణం భర్తవంకే తదేకంగా చూసిన పద్మజ, "మీకు నేనంటే ప్రేమవున్నా లేకపోయినా, నేను తల్లిని కాబోతున్నాను" అంటూ దిండులో ముఖందాచుకుంది. చటుక్కున ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

భార్య చెప్పిన మాటకి పులకించి

పోయాడు చక్రపాణి. తను...తను తండ్రి కాబోతున్నాడు. ఎంత మధురమైన అనుభూతి! దిండులో తలదూర్చిన భార్య ముఖాన్ని తనవేపు తిప్పుకుంటూ ఆమె బుగ్గలు రెండూ ముద్దుపెట్టుకున్నాడు.

"పద్మా! నీ మీద ప్రేమ లేదని ఇదంతా నటనని నువ్వు అనుకోవడం నా దురదృష్టం. నిన్ను నా దాన్నిగా చేసుకున్నప్పటినించీ ఒక్క-క్షణమైనా వదలలేక నీతోనే జీవితంగా, లోకంగా గడిపే నన్ను నీ మనోవేదనతో చిత్రవధ చేయకు. నాలోని అణువణువూ నీవే! నా జీవనజ్యోతివి. నా అనురాగ మూర్తివి అయిన నిన్ను ప్రేమించడం లేదని నువ్వు అపోహపడుతూ నాకెంత వేదనని కలిగించావో నీకు అర్థంకాదు. ఆనాడు నేను ఆపకపోతే నువ్వు నిలువునా ప్రాణం పోగొట్టుకుని వుండేదానివి. అది నాకెంతశిక్ష విధించి తప్పుకోవడమో నువ్వు గుర్తించలేవు." చిన్నపిల్లాడిలా వెక్కి వెక్కి ఏడుస్తున్న భర్తని చూసి "ఊరుకోండి, మీ మనస్సు నొప్పించినందుకు నన్ను క్షమించండి," అంది పద్మజ బాధగా.

"నేను నా హృదయాన్ని దేవాలయంగా, మీరే అందులోని దేవునిగా నిలుపుకుని పెళ్ళయిన నాటినించీ ఆరాదిస్తున్నాను. ప్రాణంకంటే ఎక్కువగా ప్రేమిస్తున్నాను. అలాంటి మీ హృదయంలో నాకంటే ముందే ఎవరో వచ్చి నిలిచిపోయారన్న అపోహతో అది భరించలేక చిత్రహింస పాలయ్యాను. మీరు నా భర్త, నా దైవం. మీ హృదయంలో నాకు మాత్రమే చోటు వుండాలన్న వెర్రి స్వార్థమే నన్నలా చని పొమ్మని పురికొల్పింది. నాకంటే ముందే మీరింకో అమ్మాయిని భార్యగా స్వీకరించారని గ్రహించి బొత్తిగా సహించలేకపోయాను," వెక్కి వెక్కి ఏడుస్తూ అంది పద్మజ.

"పద్మా! ఏడవకు? నీ కన్నీళ్ళు నేను చూడలేను. సత్యవతిని మొదట నేను పెళ్ళిచేసుకున్నమాట నిజమే! కాని ఆమె ఏనాడూ నా ఉనికిని సహించలేకపోయింది." అంటూ డ్రాయరు సొరుగు తాళంతీసి అందులో అట్టడుగునఉన్న ఒక పుస్తకం తీసాడు.

సత్యవతిరాసిన ఉత్తరం తీసి పద్మజకిచ్చాడు. వణికే చేతులతో చదివింది పద్మజ. ఆ తర్వాత పార్శిల్‌లో వచ్చిన మంగళసూత్రాలు చూపించాడు.

"ఇప్పుడు చెప్పు! ఇలాంటి స్త్రీని నేను ప్రేమించగలుగుతానా! కాపురానికి వచ్చాక భార్యగనుక మోజుగానే వుండేది నాకామె అంటే మొదట్లో. కాని రాను రాను మా యిద్దరిమధ్యా పెద్ద అఖాతం ఏర్పడ్డాక మనసు విరిగిపోయింది? ఇప్పుడసలు నాకామె తలపే ఎన్నడూ గుర్తురాదు. నిన్ను పెళ్ళిచేసుకున్నాక

నా భార్య ఎలావుండాలని ఆశించానో అలా అన్నివిధాలా అతికినట్లు సరిపోయావు. రానురాను నిన్ను విడిచి క్షణం వుండ లేని పరిస్థితిలో పడిపోయాను. అందుకే మళ్ళీ నిన్నింతవరకూ మీ ఇంటికికూడా పంపలేదు," అన్నాడు గద్గదికంగా.

అంతా విన్న పద్మజ ముఖం ఆనం దంతో విప్పారింది. "నన్ను మన్నిం చండి," అంది భర్త చేతులుపట్టుకుని.

"పిచ్చిదానా! మనలో మనకి మన్నిం పులు ఏమిటి? నువ్వు ఇప్పటికైనా అర్థంచేసుకోగలిగావు, అంతే చాలు," అన్నాడు ఆమె నుదుటిమీద లాలనగా చుంబించి.

ఆ తర్వాత రెండు రోజుల్లోనే మామూలు మనిషి అయింది పద్మజ.

జ్వరం తగ్గిపోయినా ఇంకా వాంతు లవీ అవుతూవుండటంతో కోడలికి నెల తప్పిందని గ్రహించింది సూరమ్మ. ఆ ఆనందంపట్టలేక కొడుకు రాగానే చెప్పింది. "మనకి మనవడు పుడతా డండి" అంటూ భర్తకిచెప్పేదాకా ఆమెకి తోచిందేకాదు. కామయ్య సంతోషిం చాడు. ఇరుగుపొరుగు ఇళ్ళకి అందించి వచ్చేదాకా నిద్రపోలేదారోజు సూరమ్మ. పద్మజ మళ్ళీ మామూలుగా తిరుగుతూ వుంటే చదువులో పడిపోయాడు చక్ర పాణి. పరీక్షలు దగ్గరపడుతున్నాయని మరింత దీక్షగా చదవసాగాడు.

ఏడో నెల. కూతురిని పురిటికి పంప మని వచ్చింది పద్మజ తల్లి సీతమ్మ. అప్పుడామెని పంపడం ఇంట్లో ఎవరికీ ఇష్టంలేదు. పైగా చక్రపాణి పరీక్ష వ్రాయడానికి బెజవాడ వెళ్ళాడు. ఆరోజే పరీక్షలయి ఇంటికివచ్చాడు. పద్మజ వెళ్ళడం అతనికసలు ఇష్టంలేదు.

"తొమ్మిదో నెల రాగానే వస్తుంది లెండి," అన్నాడు చక్రపాణి.

వంత పాడింది సూరమ్మ.

వాళ్ళెవరికీ ఇష్టంలేదని గ్రహించిన పద్మ "తొమ్మిదో నెలలోనే వస్తాలేమ్మా. ఇక్కడ అత్తయ్యగారయినా తల్లిలాగా చూసుకుంటున్నారు. నాకేమీ కష్టం లేదు," అంది.

ఆ మాటకి చాటంత ముఖం అయింది సూరమ్మకి.

"పరీక్షలు బాగా వ్రాసారా?" అనడి గింది భర్తని ఆ రాత్రి.

"ఓ బ్రంహ్మాండంగా రాసాను," అన్నాడు భార్యని దగ్గరికి తీసుకుంటూ చక్రపాణి.

పద్మజ ముఖం ఆనందంతో వికసిం చింది. అలాగే రోజులు గడిచిపోయాయి.

"పద్మా! నువ్వు పురిటికి పుట్టింటికి వెడితే మళ్ళీ నాలుగునెలల దాకా రావేమో గదూ" అన్నాడు దిగులుగా. తొమ్మిదో నెల వచ్చిందగ్గరనుంచీ రోజుకోసారన్నా చక్రపాణి ఆ మాట అంటూనే వున్నాడు.

"సాధ్యమయినంత త్వరగా నే వచ్చేస్తాలెండి," అంది ఓదార్పుగా.

సీతమ్మ వెంట పద్మజని భారమైన హృదయంతోనే పంపాడు చక్రపాణి.

"మీరు వారానికి ఒకసారన్నా వచ్చి చూస్తారుగదూ ! రోజూ ఉత్తరం రాయండి" అంది కన్నీళ్ళతో వెడుతూ పద్మజ.

"తప్పకుండా వస్తాను. నిన్ను చూడందే నేను వుండగలనా?" అన్నాడు.

పద్మజ వెళ్ళిపోయాక చాలా వెలితిగా తోచింది సూరమ్మ, జయలక్ష్మిలకు.

కళకళలాడుతూ తిరిగే చిన్నకోడలు లేకపోవడంతో కామయ్యకి కూడా కాస్త ఇల్లు చిన్నబోతోందన్న భావం కలిగింది.

తన మంచితనంతో వివేకంతో అందరి హృదయాలలోనూ స్థిర నివాసం ఏర్పరచుకుంది పద్మజ.

రోజూ శుభవార్తకోసం ఎదురు చూడటంతో సరిపోతోంది ఇంట్లో అందరికీ.

వారానికోసారి వెళ్ళి పద్మజని చూసి వస్తూనేవున్నాడు చక్రపాణి.

"ఒరేయ్ ! రాత్రినించీ నాకేమిటో కడుపులో ఆందోళనగా వుంది. పద్మ ఎలావుందో, నొప్పులొస్తున్నాయో ఏమో చూసిరారా !" అంది సూరమ్మ ఆ రోజు లేస్తూనే.

అతను పద్మజని చూసి నాలుగు రోజులే అయింది అప్పటికి. అయినా అతనికి చూడాలనే పీకుతోంది. తల్లి చెప్పగానే బస్ ఎక్కాడు ఆ క్షణమే !

"రాత్రి ఒంటిగంటనించి పద్మజకి నొప్పులొస్తుంటే ఆస్పత్రిలో చేర్చాము. వాళ్ళమ్మ ఇంకా అక్కడే వుంది," అన్నాడు మామగారు.

వెంటనే ఆస్పత్రికి పరిగెత్తాడు. అత్తగారు బయటే కనిపెట్టుకునివుంది.

"ఇంకా ప్రసవం కాలేదయ్యా ! అరగంటలో అవవచ్చన్నారు." అంది అల్లుడిని చూసి.

"చక్రపాణి గుండె దడదడా కొట్టుకుంది. సుఖప్రసవం అయి త్వరగా పద్మజ బయటకి వస్తే బాగుంటుం" దని మథనపడసాగాడు.

మరో పావుగంటకి క్యారుమన్న స్వరం విని ఆనందంతో వుప్పొంగిపోయాడు. సీతమ్మ ముఖం చాటంత అయింది నర్సు బయటకివచ్చి "మగపిల్లాడు" అంది.

చక్రపాణి ఆనందం పట్టలేకపోయాడు. జేబులో చేయిపెట్టి అయిదు రూపాయలు నర్సుచేతిలో వుంచాడు.

మనవడు పుట్టాడనగానే సీతమ్మకి తహతహ ఎక్కువయింది, ఎప్పుడెప్పుడు చూద్దామా అని.

అరగంట గడిచాక నర్సువచ్చి "మీరు వెళ్ళి చూడవచ్చు" అని చెప్పి వెళ్ళిపోయింది. సీతమ్మ, చక్రపాణి గదిలోకి అడుగుపెట్టారు. అనుకోకుండా భర్త కనిపించేసరికి పద్మజ ముఖం సంతోషంతో విప్పారింది.

సీతమ్మ కూతురి యోగక్షేమాలడిగి మనవడిని చూసి "మీ నాన్నతో చెప్పి మళ్ళీ వస్తానమ్మా" అంటూ కాఫీ త్రాగించి వెళ్ళిపోయింది.

"మీ అబ్బాయిని చూసుకున్నారా ?" అంది పద్మజ భర్తతో.

"ఏడీ ! అబ్బాయినీ, కన్నతల్లినీ చూసుకోవడంతోనే సరిపోయింది ఇప్పటి దాకా" అంటూ బాబుని మురిపెంగా చూసుకోసాగాడు.

"నుదురూ, కళ్ళూ, ముక్కూ, నోరూ అంతా మీవే వచ్చాయి." అంది పద్మజ కొడుకుని చూస్తూ.

సున్నితంగా బాబు బుగ్గలను స్పృశించి భార్యతో "అమ్మ వెళ్ళు వెళ్ళని పొద్దున్నే అంటూ వుంటే నాకూ ఎందుకో చూడాలన్పించి మనసాగక వచ్చేసాను. వచ్చినందుకు కొడుకుని అందించావు,'' అన్నాడు ఆపేక్షగా చూస్తూ.

"మరి కబురు చేయండి ఇంటికి" అంది పద్మజ నవ్వుతూ.

పద్మజ తండ్రి కూతురిని చూడ టానికి వచ్చాడు అప్పుడే.

యోగక్షేమాలయ్యాక "నేను వెళ్ళి చెప్పి వస్తాను మీ ఇంట్లో. అమ్మాయి వుండమంటోందిగదా వుండిపో !" అన్నాడు.

సరేనన్నట్టు తల వూపాడు చక్ర పాణి.

ఆ రోజు సాయంత్రం పేపరులో రిజల్ట్సు వచ్చాయి. చక్రపాణి ప్యాసయ్యాడు.

కొడుకు పుట్టాడన్న సంబరం ఒక ప్రక్క, పరీక్ష ప్యాసయ్యానన్న సంబరం ఒక ప్రక్క ఎక్కడా నిలబడనీయలేదు చక్రపాణిని. పద్మజ సరేసరి. కొడుకు పుట్టడంకన్న చక్రపాణి ప్యాసవడమే మరింత ఆనందాన్ని కలిగించింది ఆమెకి. మనవడు పుట్టాడన్న వార్త వినగానే మధ్యాహ్నం బస్సులో వచ్చింది సూరమ్మ, కూడా జయలక్ష్మినితీసుకుని.

ఇటు కొడుకు మెట్రిక్ ప్యాసయ్యా డనేసరికి ఏనుగెక్కిందా మాతృ హృదయం.

జయలక్ష్మి ఆ సాయంత్రమే వెళ్ళి పోయింది మరిదిగారి విజయవార్త భర్తకి, మామగారికి చెప్పేయాలని.

రెండు శుభవార్తలు చిన్నకొడుకుని గురించి విన్న కామయ్య సంతోషంతో మీసం మెలివేసి ఎరిగున్నవారందరికీ చెప్పి వచ్చాడు ఆ రాత్రికి రాత్రే.

సూరమ్మ రామలక్ష్మికి ఉత్తరం రాయించింది కొడుకుచేత.

తమ పుట్టింట్లో వంశోద్ధారకుడు పుట్టి నందుకు ఎంతైనా ఆనందించింది రామ లక్ష్మి.

జయలక్ష్మికి ఇద్దరూ ఆడపిల్లలే అవడంచేత మేనల్లుడు పుట్టాడనగానే

సంబరపడి స్నానంరోజుకి వస్తానని కబురుచేసింది.

మర్నాడు కోడలు కులాసాగానే వుంది కనుక ఇంటికి బయలుదేరింది సూరమ్మ.

"పురిటి స్నానానికి రండి తప్పకుండా" అంటూ మరీ మరీ చెప్పి సాగనంపింది సీతమ్మ.

మళ్ళీ వస్తానని చక్రపాణి కూడా వెళ్ళిపోయాడు, తల్లితో కలిసి.

## 6

"కంగ్రాట్యులేషన్స్ మీరు లోయరు పాసయ్యారు" అంటూ వచ్చాడు మురళి.

"థ్యాంక్స్! కూర్చోండి" అంటూ కుర్చీ చూపించింది సత్యవతి.

మురళి కూర్చున్నాడు. సత్యవతి పదినిమిషాల్లో టీ తయారుచేసి రెండు కప్పుల్లో పోసి తెచ్చింది. అతని కొకటి ఇచ్చి తను ఒకటి తీసుకుని పక్కనే వున్న మడతమంచంమీద కూర్చుంది.

"హయ్యరుకి కడ్తారా ?" టీ త్రాగుతూ అడిగాడు మురళి.

"కట్టాలి మరి. ఇంకా ప్రిపేరవ్వాలి గదా ! ఇంటర్మీడియట్ కి వెడదామా అని కూడా అనుకుంటున్నాను."

"ఇంకేం! అదీ, ఇదీ నేర్చుకోవచ్చు. ప్రైవేటుగానేకదా ఇంటరు చదివేది ? కాలేజీలో చేర్తారా ?"

"కాలేజీలో చేరను. కాని ట్యూషన్ చెప్పించుకోవాలిగదా! సబ్జక్టులన్నీ అర్థం కావద్దూ !" సాలోచనగా అంది.

"మరేం ఫర్వాలేదు. ఇప్పుడంతా తెలుగు మీడియమేగదా ! శ్రద్ధగా చదివితే ఏమంత కష్టం అనిపించదు."

కాసేపుండి వెళ్ళిపోయాడు మురళి.

మురళి ఇంటరు పాసై ప్రైవేటుగా బి. ఏ. కి కట్టాడు. సత్యవతితోపాటు టైపు నేర్చుకుని అతనూ లోయరు ప్యాసయ్యాడు

మురళి సన్నగా, పొడవుగా కాస్త హిప్పీ ఫ్యాషన్‌తో తమాషాగా వుంటాడు.

మొదట్లో సత్యవతిని పలకరించింది అతనే ! ఎవరూ మాట్లాడకపోయినా రోజూ మురళి మాత్రం విష్ చేస్తూ ఏదో ఒకటి కల్పించుకుని మాట్లాడుతూ ఆమెతో కూడా వాళ్ళ సందువరకూ కబుర్లు చెబుతూ రావటం అలవాటయింది.

సత్యవతి తండ్రిని ఒప్పించి ఇంటరు పరీక్షకి కట్టింది. గ్రూపులు రెండూ ఒకటే కావడంతో తన పుస్తకాలూ, నోట్సులూ ఇచ్చాడు మురళి.

తనపట్ల అంత శ్రద్ధ చూపుతున్న మురళి అంటే చాలా అభిమానం కలిగింది సత్యవతికి.

తనకి తెలిసినంతమట్టుకు ఆమెకి రోజూ ఇంటికి వచ్చి చెప్పసాగాడు మురళి.

ఆ రోజు సత్యవతి పుట్టినరోజు. తలంటుకుని తండ్రి కొని పంపిన గులాబీరంగు చీరకట్టుకుని, జడలో ఒక ప్రక్కగా గులాబిపువ్వు పెట్టుకుని గుమ్మంలో నిలబడింది.

"వండర్ ! ఈ రోజు గులాబి బాలలా అందాలు విరజిమ్ముతున్నారు. ఏమిటి విశేషం ?" అంటూ వచ్చాడు మురళి.

మురళిని చూచి వికసితవదనంతో "రండి ! ఈ రోజు నా పుట్టినరోజు", అంటూ గదిలోకి దారితీసింది సత్యవతి.

"బాగుంది ! పుట్టినరోజని ఇప్పుడా చెప్పడం ?" కాస్త కినుకగా అన్నాడు మురళి కూర్చుంటూ.

"ఎప్పుడు చెబితేనేమి ?" అంటూ ప్లేటులో ఒక లడ్డూ, కాస్త బూందీ పెట్టి, అందిస్తూ—

"ఏదో సింపుల్‌గా మీకు మాత్రమే చిన్న పార్టీ ఇస్తున్నాను" అంటూ నవ్వింది.

"పోనీయండి ! ఆ మాత్రమన్నా నేనంటే అభిమానం వుంది."

"మీ మీద అభిమానం లేకుంటే నేనసలు గుమ్మం తొక్కనిచ్చేదాన్నా మిమ్మల్ని !"

"నిజంగా నేనంటే అంత అభిమానం వుందా సత్యా !"

సత్యా అని అతను పిలవగానే గుండె జల్లుమంది సత్యవతికి.

"ఆ మాట ప్రత్యేకించి అడగాలా ! ఆ మాత్రం తెలుసుకోలేరూ ?"

మురళి చటుక్కున కుర్చీలోంచి లేచి ఆమె చెయ్యి అందుకుని "ధన్యుణ్ణి" అంటూ గట్టిగా నొక్కాడు చేతిని

అతని స్పర్శలో ఏదో మాధుర్యం చవిచూసింది సత్యవతి.

నెమ్మదిగా చేయి లాక్కుని "టీతెస్తా నుండండి" అంటూ వెళ్ళింది.

ఆమె తెచ్చిన టీ రెండు గ్లాసులు చేసి "నువ్వు కూడా త్రాగాలి" అంటూ అందించాడు సత్యవతికి.

చిరునవ్వుతూనే త్రాగింది సత్యవతి.

"సాయంత్రం సినిమాకి వెళదాము. రెడీగా వుండాలి." చిరునవ్వుతూ అన్నాడు మురళి.

"అలాగే".

"మరి నేను వస్తాను." అంటూ ఆమెకి షేక్‌హాండ్ ఇచ్చి వెళ్ళిపోయాడు మురళి.

మురళి ఏమంత కలవారి పిల్లాడు కాదు. తండ్రికి బట్టలకొట్టు వుంది. అయిదుగురు పిల్లలు వున్నారు. దాని మీద వచ్చే ఆదాయం సరిపోతుంది. ఇంటికి పెద్దకొడుకు అని మురళిని కొంచెం ఎక్కువగా అభిమానిస్తాడు తండ్రి.

కాలేజీలో చేరి చదవమంటే వద్దని ప్రైవేటుగానే బి.ఎ.కి కట్టి పగలు టైపు నేర్చుకుంటూ లోయరు పాసయ్యాడు

అతని ఖర్చులకని నెలకి తండ్రి ఇచ్చే డబ్బు సత్యవతితో పరిచయం అయ్యాక చిన్న చిన్న బహుమతులు, అప్పు డప్పుడు సినిమాలు అంటూ ఖర్చు పెడతాడు ఆమెకోసం, తను పొదుపు. వాడుకుంటూ.

ఎప్పుడూపదిరూపాయలనోటు అతని షర్టుజేబులోంచి కనబడుతూవుంటే "బాగా డబ్బున్నవాడే అయ్యుండాలి", అను కుంటూ వుంటుంది సత్యవతి.

ఆ రోజు హిందీ సినిమాకి వెళ్లారు ఇద్దరూ.

వెనకటి స్నేహం ఒక అడుగు ముందుకు వేసింది. వీలు చిక్కినపుడల్లా ఆమెని ముద్దుపెట్టుకోవడం దగ్గరకి లాక్కోవడం ప్రారంభించాడు మురళి.

అందుకు సత్యవతి అభ్యంతరం పెట్టలేదు. మురళి తనను పెళ్ళి చేసుకుంటాడేమోనని అతనినుంచే ఆ మాట రావాలని ఎదురు చూస్తోంది సత్యవతి.

సత్యవతి పెళ్ళికాని యువతే అని మురళి అనుకున్నాడు. అందుకే ఆమె మనసులోస్థానం సంపాదించాలని తాప త్రయ పడటం ఎక్కువయింది.

వరుసనే వారంరోజులు రాలేదు మురళి. 'ఎందుకు, రాలేదా' అని సత్య వతి మథనపడసాగింది. "మురళిని చూడకపోతే తన మనసిలా అయిపోతోం దేమిటి ? తను అతన్ని అంతగా ప్రేమి స్తోందా !" అని ఆశ్చర్యపోయింది.

"ఏమయినా ఈసారి తనే అతన్ని పెళ్ళిచేసుకోమని సూచించాలి. ఎన్నాళ్లు చూసినా అతని నోటి వెంట ఆ మాట రావడమేలేదు. తనే చొరవ తీసు కోవాలి. లేకపోతే లాభంలేదు అను కుంది మనసులో.

చదువుకుందామని పుస్తకం తీసినా మనసు దానిమీద లగ్నం చేయలేక పోయింది ఇంక విసుగేసి పుస్తకం పడేసి మంచంమీద వాలి కళ్ళు మూసు కుంది. ఆలోచనల మధ్య ఎప్పుడు నిద్రపట్టిందీ తెలియలేదు. సన్నగా తలుపు కొట్టిన శబ్దం అయి ఉలిక్కి పడి లేచింది.

తలుపు తీసింది ఎదురుగా మురళి ! ఆమె నిద్రమత్తంతా జారిపోయి "అబ్బ ! ఎన్నాళ్ళకి కనిపించావు మురళీ ! ఈ మధ్య రావడంలేదేం ? " అంటూ కుర్చీ వేసి ప్రశ్నలవర్షం కురి పించింది. సమాధానంగా మురళి జేబు లోంచి కవరు తీసి నవ్వుతూ ఆమెకి అందించాడు.

దానిమీద ఆర్. సత్యవతి అని తన పేరే వుంది. లోపలినించి కార్డు బయ టికి లాగింది. అది శుభలేఖ.

"నా కుమారుడు చి. మురళీనాధ్‌కు: వీరన్న బావగారి ద్వితీయ కుమార్తె శాంతాదేవిని ఇచ్చి చదువుతున్నసత్యవతి

బుర్ర గిరగిరా తిరిగిపోసాంది. మురళి పెళ్ళిచేసుకుంటున్నాడు. అది తనను కాదు. మరెవరో పిల్లని.

"అదేమిటి మురళీ!మాటమాత్రమైనా చెప్పలేదు ముందుగా" అనడిగింది కంపితస్వరంతో.

"ఏదీ అన్నీ అనుకోకుండా క్షణాల మీద జరిగిపోయాయి."

"అయితే మన ప్రణయం ఇంతటితో అఖరన్నమాట."

"క్షమించు సత్యా ! నాకు నిన్ను చేసుకోవాలని వున్నా మా పెద్దవాళ్ళు ఎంతమాత్రమూ ఒప్పుకోరు. మా నాన్న గారికి కట్నం కావాలి. మా అమ్మగారికి లాంఛనాలు కావాలి. అవి అన్నీ తీర్చ గల సంబంధం కుదరగానే చటుక్కున నాన్న ముహూర్తం పెట్టేశారు. ఇప్పుడు నేను కాదంటే మావాళ్ళ పరువేం కావాలి ! నన్ను మరచిపోయి మరో వ్యక్తిని చేసుకొని సుఖపడు", అంటూ లేచి "మరి వస్తాను. ఇంకా నాఫ్రెండ్స్‌కి శుభలేఖలు పంచాలి." అంటూ వెళ్లి పోయాడు. వెడుతున్న అతన్ని, చేతి లోని శుభలేఖని మార్చి మార్చి చూస్తూ వెర్రిదానిలా నిలబడిపోయింది సత్యవతి. తన ఆశలన్నీ భగ్నమయ్యాయే అను కుంటూ మూగగా రోదించింది .

## 7

"ఇరవై ఒకటోనాడు తీసుకెడతాం పద్మిని" అంది సూరమ్మ కోడలి పురిటి స్నానానికి వచ్చిన రోజున.

"మూడోనెల రాకుండా బాలింతరాల్ని ఎలా పంపుతాము ?" అంది సీతమ్మ కాస్త నిష్ఠురంగా.

"ఆతర్వాత మూఢమి వస్తుంది. ఇంటికివెళ్ళి బారసాలచేసుకోవాలిగదా."

"అదేం ! బారసాల ఇక్కడే చేసుకో రాదా ?"

"ఇక్కడ కాదులెండి "మాయింట్లోనే చేసుకుంటాము. ఇరవై ఒకటోరోజునే తీసికెడతాము పద్మజని." అక్కడే వున్న చక్రపాణి అందుకుంటూ అన్నాడు.

"ఆడపిల్లకి పెళ్ళయ్యాక అంతా వాళ్ళిష్టమేగాని మన ఇష్టం కాదుగదా!" అని మనసులో నిట్టూర్చింది సీతమ్మ.

రామలక్ష్మి మేనల్లుడినిచూసి మురిసి పోయింది. "నీ కొడుకు మంచి అందంగా వున్నాడురా చక్రం" అంటూ పదే పదే ముద్దులాడింది బాబుని.

"మీరు ఇంటరుకికూడా కట్టండి" అంది పద్మజ భర్తతో ఏకాంతంగా వున్నప్పుడు.

"ఇంతక్రితం అంటే ఏదో సరి పోయింది. ఇప్పుడుబాబు పుట్టాడు ఇంకా చదువేంసాగుతుంది" అన్నాడు చక్ర పాణి కొడుకును ఒళ్ళో కూర్చోబెట్టు కొని.

"ఎందుకు సాగదు? వాడేమన్నా వద్దంటాడా ! పుట్టానే తండ్రిని పాస్

చేయించాడాయె'' అంది పద్మజ మెల్లగా నవ్వుతూ.

"సరే! మన ఇంటికి వెళ్ళనీ! అక్కడ ఆలోచించుకుందాము.''

అన్నట్టుగానే 21 వ రోజు బాబుని, భార్యని తీసుకుని వచ్చేశాడు చక్రపాణి.

అయిష్టంగానే చలిమిడి, జంతికలు అన్నీ చేసి చీరపెట్టి పంపింది సీతమ్మ.

పిల్లాడిని పద్మజ ఎత్తుకొనిరాగానే ఇరుగుపొరుగువారంతా వచ్చారు చూడ టానికి. పద్మజ అందరిళ్ళల్లోను తను తెచ్చినవన్నీ పంచిపెట్టించింది తోటి కోడలుచేత.

కామయ్య మనవడి బారసాలవైభవంగా జరిపించాడు. ఊరంతా భోజనాలు పెట్టించాడు. పిల్లాడికి కామయ్య కోరిక ప్రకారం 'శ్రీనివాస్' అనేపేరు పెట్టాడు చక్రపాణి. ఆ సాయంత్రం ఉయ్యాల వేడుకలు కూడా ఘనంగానే జరిపించింది సూరమ్మ. అత్తగారి ఇంటికి వచ్చాక మళ్ళీ ఒకసారి గుర్తుచేసింది పద్మజ భర్తకి. ఇంటరుకి కట్టడమా, మానడమా అని రెండురోజులు ఆలోచించి చివరికి కట్టడానికే నిర్ణయంచుకున్నాడు చక్ర పాణి.

తల్లి అయ్యాక మరింత అందంగా కనపడింది పద్మజ. తాంబూలంతో ఎఱ్ఱ బడిన పెదవులు, నడుముకు కట్టు, ఎంతో నిండుగా, మాతృత్వపు గర్వంతో అందాలు విరజిమ్మే పద్మజని చూస్తూ తనీసారి శ్రద్ధగా చదవగలడా! అని పించింది చక్రపాణికి.

శ్రీనివాస్ సంరక్షణంతా సూరమ్మే చూసుకునేది కోడలు చిన్నపిల్ల అంటూ. బాలింతరాలినని కూర్చోకుండా ఏదో ఒక పని చూస్తూనేవుండేది పద్మజ. ఇది వరకటిలా తొమ్మిదింటిదాకా బయట తిరగటం ఏనాడో మానేసాడు చక్రపాణి. భార్య తనకోసం అన్నం తినకుండా కనిపెట్టుకుని కూర్చుంటుందని తెలిసాక త్వరగా ఇల్లు చేరుకోవడం మొదలుపెట్టాడు. ఇప్పుడు మరీ ఏడయ్యేసరికే ఇంటికి వచ్చేయసాగాడు. పుస్తకాలు తెచ్చుకుని చదువు ప్రారంభించాక పెందలాడే భోజనం చేయడంతో వంటింటి పని కూడా త్వరగానే అయిపోయి కాస్త తెరిపిగా వుంది పద్మజకి.

ఈసారీ కామయ్య, కొడుకు చదువుని గురించి ఏమీ వ్యాఖ్యానించలేదు. లోలోపల కాస్త గర్వపడకనూపోలేదు. అయినా పైకి గంభీరంగానే వుండి పోయాడు.ఎప్పుడూ జ్వరుమన చీది ఎరుగని సూరమ్మ మంచం ఎక్కింది.

జయలక్ష్మికి వేవిళ్ళు. ఏం తినమన్నా సహించదు అంటూ తినడం మానేసి మంచానికరచుకుపోవడంతోఅన్నిపనులూ పద్మజమీదే పడ్డాయి

తెల్లవారుజామున లేచింది మొదలు

వంచిన నడుము ఎత్తకుండా ఏదో ఒక పనితోనే సరిపోయేది.

లంకణాలతో వున్న అత్తగారికి టెంపరేచరు నోట్ చేసుకుంటూ, వేళకి మందులు శ్రద్ధగా ఇస్తూ, గ్లూకోజునీళ్ళు, పళ్ళరసాలు శ్రద్ధగా త్రాగిస్తూ పరిచర్యలు చేస్తుంటే సూరమ్మకి మనసులోఆనందం కలిగినా "ఆర్నెల్లవరకూ అరికాలి పచ్చి వుంటుందమ్మా బాలింతకి. కాస్త తడిన పొడిన తిరగకు" అంటూ మంచంలో పడుకునే హెచ్చరిస్తూవుండేది.

జయలక్ష్మి ఏ పనీ చేసే అవకాశం లేదు సరిగదా ఆమెకే ఎదురుచేయాలి. మంచం దిగలేని వేవిళ్ళుంటాయా' అని కూడా ఆశ్చర్యంవేసేది పద్మజకి.

ఇంతెడు చాకిరీ భార్య రెక్కలమీద పడటం చక్రపాణికి మనసులో బాధగానే వుండేది. ఏదన్నాసాయంచేద్దామనుకున్నా తల్లి, వదిన, "పెళ్ళాం అలసిపోతుందని చాకిరీచేస్తున్నాడు." అని హేళన చేస్తారేమోనని భయపడి వూరుకునేవాడు.

"నా కోసం టిఫినులేం చేయకమ్మా! అసలే పనితో సతమత మవుతున్నావు," అన్నాడు కామయ్య ఒకరోజు, కోడలి అవస్థచూసి.

"ఫర్వాలేదులెండి! మీరు మధ్యాహ్నం భోజనాలదాకా ఆగలేరు," అంటూ మామూలుగానే ఏదో ఒకటి తయారు చేస్తుండేది. ఇన్ని పనులలోనూ భర్త దగ్గర రాత్రి పదింటివరకూ కూర్చొని చదివించడం మాత్రం మానలేదు. ఇంటి పనులతో బాబు పనులతో శరీరం అలసి నిద్ర కూరుకువస్తున్నా బలవంతాన ఆపుకొని భర్తకి తోడుగా ప్రక్కనే కూర్చుని తనూ ఏదో పుస్తకం తిరగేస్తూ వుండేది.

అన్నీ గమనిస్తున్న చలపతి భార్యతో "నీ వేవిళ్ళవీ కాస్త తగ్గిఆరోగ్యంకుదుట పడేవరకూ మీ వాళ్ళింట్లో వుండిరా! పసిపిల్లాడితో ఆ పిల్ల నానా అవస్థాపడు తోంది. నీకూ, నీ కూతుళ్ళకీ కూడా చాకిరీ చేయాలంటే అసలే ఆ పిల్ల అర్భకురాలు,'' అన్నాడు.

సూరమ్మ ఆ మాట విని "అదేమంచిది. ఓ పదిరోజులుండిరా!" అని చెప్పింది. మర్నాడు మంచిరోజుచూసి జయలక్ష్మిని, పిల్లలను పుట్టింట్లో దింపివచ్చాడు చలపతి. జయలక్ష్మి వెళ్ళడంతో కాస్త పని తగ్గింది పద్మజకి.

కాలం ఎవరికోసమూ ఆగదు. అలా పరుగిడుతూనేవుంటుంది. ఆ కాలచక్రంతో మారే మానవస్వభావాలనూ జరిగేమార్పు లనూ పరికిస్తూ ఆశ్చర్యపడటమే మనకు చేతనయింది. చక్రపాణి పరీక్షనెంబరు, హాల్‌టిక్కట్లు అన్నీ వచ్చాయి. ఇంకో వారంరోజుల్లో పరీక్షలు ప్రారంభం.

"పద్మా! ఆ కవర్లో రెండుప్యాంట్లు, రెండు షర్టులు తెచ్చాను చూడు" అన్నాడు రాత్రి ఇంటికివస్తూనే.

పద్మజవిప్పిచూసింది. "బాగున్నాయి,

ఆ రెండురంగులూ మీకు బాగా సూటవు తాయి", అంది విస్ఫారిత నేత్రాలతో.

"పరీక్షహాల్లోకి పంచెకట్టుకొని వెడితే క్రితంసారి అంతా వింతగా చూసారు. అందుకని ఇప్పుడు ప్రత్యేకంగా వాటిని కుట్టించుకున్నాను."

"మంచిపని చేసారు. క్రిందటిసారే చెబుదామనుకుని వూరుకున్నాను," అంది పద్మజ నవ్వుతూ.

"క్రితంసారి పరీక్షలప్పుడు శ్రీనివాస్‌ని కడుపుతో వున్నావు. ఈసారీ మరో బంగారుబాబుని కడుపులో దాచుకున్నావు. అంచేత ఈసారీ నేను పరీక్ష పాసవుతాను." చిలిపిగా అన్నాడు చక్రపాణి.

పద్మజ సిగ్గుతో తలవంచుకొని "మీరు పాసవడంకంటే కావల్సిందేమీ లేదు," అంది. అప్పటికి ఆమె గర్భిణి.

ఈ చదువుఅంతా కేవలం నీ ప్రోత్సాహమే పద్మా! నువ్వు చదువుకోమని పట్టుపట్టి వుండకపోతే అసలు పుస్తకం పట్టేవాడినికాదు. అలాగే వుండేవాడిని.

"అలా వుంటేఎలా! రేపు మీఅబ్బాయిలకి మీరు చదువుచెప్పకోవద్దూ" అంది మందహాసంచేస్తూ.

"తప్పకుండాను! నా బిడ్డలకి నేనే మేష్టర్ని."

పాంటూ షర్టూ వేళ్ళేనాడు వేసుకున్నాడు చక్రపాణి. అంతవరకూ పంచెకట్టులో చూడటానికి అలవాటుపడిన పద్మజకి భర్త మరీ కుర్రాడిలా కనబడితే కొంచెం నవ్వు, మరికొంచెం సిగ్గుకూడా కలిగాయి.

"ఎలా వున్నాను?" అన్నాడు దగ్గరగా వచ్చి.

"చిన్న కుర్రాడిలా వున్నారు."

"నేనుకుర్రాడినికాక ముసలివాడినా?" కొంటెగా అడిగాడు.

"కాదులెండి! అలా ఎవరన్నారు?"

భార్యని దగ్గరగా తీసుకుని ముద్దు పెట్టుకుంటూ "వెళ్ళిరానా!" అన్నాడు చక్రపాణి

"వెళ్ళి పరీక్షలు చక్కగా రాసి రండి."

"ఓ కె."

"అరేయ్ బాబూ! నేను పరీక్షకు వెడుతున్నానురా! క్రిందటిసారి నువ్వు పరీక్ష పాస్‌చేయించావు. ఈ సారి నీ తమ్ముడు పాస్‌చేయించాలి." అంటూ బాబుని ముద్దుపెట్టుకొని భార్య కందించాడు.

"అమ్మా! నేను వెడుతున్నానమ్మా!" అంటూ వచ్చాడు తల్లిదగ్గరకి.

పాంటు వేసుకున్న కొడుకునిచూసి 'దొరబాబులా వున్నాడు నా కొడుకు' అని మురిసిపోతూ "క్షేమంగా వెళ్ళి రాసిరా నాయనా! క్రిందటిసారీ పద్మ కడుపుతో వుంది. ఈసారీ నెలలొస్తున్నాయి. ఆ పిల్లల అదృష్టంవల్లనైనా

నువ్వు పడినకష్టం ఫలిస్తే చాలు." అంది నిండుమనసుతో.

"అచ్చం కాలేజీ కుర్రాడిలానే వున్నావురా !" అన్నాడు కామయ్య కొడుకు దగ్గరకొచ్చి సెలవుతీసుకో బోతుంటే నవ్వుతూ.

చక్రపాణి నవ్వి, తండ్రికిచెప్పి వెళ్ళి పోయాడు.

సాయంత్రం పరీక్షరాసి బస్‌లో ఎక్కాడు ఇంటికి వెళ్ళడానికి. పరీక్ష లన్నాళ్ళూ మామగారింట్లోనే మకాం. విజయవాడ సెంటరు కనుక. మామగా రింటికి కాలేజీకి దూరంకనుక బస్‌లోనే వెళ్లిరావాలి. ఎక్కడా స్థలంలేక నిలబడి వున్న చక్రపాణిని ఆడవాళ్ళసీట్లో కూర్చున్న సత్యవతి తదేకంగా గమ నించసాగింది.

'ఎవరీమనిషి? చక్రపాణి పోలికలు కనబడుతున్నాయి. ఆనాడు తను వచ్చే సాక ఒక్కనాడుకూడా మళ్ళీ చక్రపాణి గుర్తురాలేదు. ఈనాడీ యువకుని చూస్తుంటే అతనిలానే వున్నాడు. "ఆ! ఇతను చక్రపాణి పోలికలున్న మరో వ్యక్తి అయివుంటాడు. ఎప్పుడూ చేలల్లో మట్టికొట్టుకుపోతూ తిరిగేమనిషి ఈ బెజవాడ ఎందుకొస్తాడు! వచ్చినా బస్ ఎందుకెక్కుతాడు! పైగా చక్రపాణికి పాంటూ, షర్టూ వేసుకునే సరదా, తెలివీ కూడా ఎక్కడేడిసింది? వట్టిఎద్దుమనిషి. నాజూకుతనం, అందం, ఆకర్షణా లేని ఓ మట్టిబొమ్మ. రంగువెలిసిన మట్టి బొమ్మ, అనుకుని అతను కాదన్న నిర్ధా రణకి వచ్చింది. ఆమెకూడా ఆ రోజు పరీక్షరాసి వస్తోంది. అసలు చక్రపాణి కివేమీ పట్టవు. అతడసలు ఆడవాళ్ళ సీట్లకేసే చూడలేదు. అతని మనసంతా ఆ సమయంలో పద్మజచుట్టూ తిరుగు తోంది.

"పద్మజ ఎలావుందో: పళ్ళరసం తాగిందో లేదో, బాబు ఏంచేస్తున్నాడో? ఈ మధ్య అల్లరి నేర్చుకున్నాడు బాగా". ఇవే అతని మస్తిష్కంలో మెదిలే వూహలు. తన స్టాప్ రాగానే దిగి పోయాడు చక్రపాణి.

అలా రెండు మూడుసార్లు పరీక్షల రోజుల్లో చక్రపాణి బస్‌లో కనబడినా అతని చేతిలో ఇంటర్‌క్వొశ్చెన్ పేపర్ను చూసి అతను కాదనే పూర్తి నిర్ణయానికి వచ్చింది. "చక్రపాణి అయితే పరీక్ష లెలా రాస్తాడు ? ఎయిత్‌క్లాస్ గ్రాడ్యు యేటు!" అని నవ్వుకుంది నిరసనగా.

పేపర్లన్నీ సంతృప్తికరంగానే రాసాడు చక్రపాణి. పరీక్షలయిన ఆఖరి రోజే బయలుదేరాడు ఇంటికి.

(సశేషం)